

ఉష్ణోగ్రత (అంచనా) 14-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	35	27
తెనాలి	36	27
నరసరావుపేట	33	26
బాపట్ల	36	26
రెంటచింతల	34	26
చీరాల	36	27

జంపనిలో.. పారిశ్రామికవాడ?



షుగర్ ఫ్యాక్టరీ స్థలాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు తదితరులు

- షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో ఏర్పాటుకు పరిశీలన
- సీఎంతో చర్చించాక ప్రకటిస్తామన్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గతంలో మూతపడిన జంపని షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేసేందుకు యోచిస్తున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాజీ ఎమ్మెల్సీ పరుచూరు అశోక్ బాబుతో కలిసి షుగర్ ఫ్యాక్టరీ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఉద్యోగుల ద్వారా కొంత సమాచారాన్ని సేకరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ రైతుల అభివృద్ధిని కాంక్షించి ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీ మూతపడటం దురదృష్టకరమన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన మేరకు ఫ్యాక్టరీకి సంబంధించిన 77 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉందన్నారు. నిరుద్యోగ యువత, రైతు కూలీలకు, కార్మికులకు పెద్ద సంఖ్యలో జీవనోపాధి కల్పించేలా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు ఇవ్వాల్సిన షేర్ ధనం రూ.2 కోట్లు, ఉద్యోగుల బకాయిలను పూర్తిగా చెల్లిస్తామన్నారు. గతంలో ఫ్యాక్టరీ తీసుకున్న రుణాలను వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరిస్తామన్నారు. సహకార రంగంలో ఉన్న ఈ సంస్థను పూర్తిస్థాయిలో ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ముఖ్యమంత్రి అనుమతితో పారిశ్రామికవాడపై నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు. వారంలోగా దీనిపై ప్రతిపాదనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు బసివిరెడ్డి శివప్రసాద్, వట్టిప్రోలు యోబు, వేములపల్లి రామకోటయ్య ఉన్నారు.

ఆయిల్.. అన్వేషణ

- ఇంధన నిక్షేపాల కోసం ఓఎన్జీసీ సర్వే
- పొనుగుపాడు కాల్వ ప్రాంతంలో పనులు
- ఒంగోలు నుంచి విజయవాడ వరకు 24 వేల బోర్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆయిల్ నిక్షేపాల కోసం చమురు, సహజ వాయువుల సంస్థ (ఓఎన్జీసీ) అన్వేషణ చేపట్టింది. ఇంధనం, గ్యాస్ నిక్షేపాలను గుర్తించేందుకు విస్తృతంగా సర్వే పనులు జరుగుతున్నాయి. శాటిలైట్ నివేదికల ఆధారంగా ఆయిల్ నిక్షేపాల కోసం ఓఎన్జీసీ



ఫిరంగిపురం : పొనుగుపాడులో భూముల్లో ఆయిల్ సర్వే కోసం వేస్తున్న బోర్లు

అధికారులు అన్వేషిస్తున్నారు. చమురు, గ్యాస్ నిల్వల ఉనికి, పరిమాణాన్ని నిర్ధారించడానికి ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో బోరు బావులను తవ్వుతున్నారు. ఒక్కొక్క బోరు 80 అడుగుల లోతున వేస్తున్నారు. ఒంగోలు నుంచి విజయవాడ కృష్ణానది వరకు సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా కొన్ని రోజులుగా ఫిరంగిపురం మండలం పొనుగుపాడు కాల్వ ప్రాంతంలోని పొలాల్లో పెద్దఎత్తున బోర్లు వేస్తున్నారు. ఈ బోర్ల నుంచి సదరు సంస్థ ఇంజనీర్లు మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపుతున్నారు. ఇలా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో మొత్తం 24,000 బోర్లు వేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే 14,000 బోర్ల నిర్మాణం జరిగింది. రానున్న రెండు నెలల్లో మిగిలిన 10,000 బోర్లు వేయనున్నారు. ఒక్కొక్కబోరుకు రూ.5,600 చెల్లిస్తున్నారు. కేవలం బోర్ల నిర్మాణానికే ఓ ఎన్జీసీ రూ.13.44 కోట్లు ఖర్చు చేస్తోంది. రైతుల ఆమోదంతోనే బోర్ల నిర్మాణం చేపట్టినట్లు సదరు సంస్థకు చెందిన కాంట్రాక్టర్లు తెలిపారు. పొనుగుపాడులో ఒకే ప్రాంతంలో పెద్దఎత్తున బోర్ల నిర్మాణం జరుగుతుండటంతో ఆ ప్రాంతాల రైతులు, ప్రజలు అక్కడ ఏమి చేస్తున్నారు.. ఎందుకు బోర్లు వేస్తున్నారనే విషయాలను పరిశీలించేందుకు, తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ఆసక్తి చూపుతున్నారు.

తల్లికి వందనం ఆనందం

సూపర్ సిక్స్‌లోని.. 'తల్లికి వందనం' విద్యా సంవత్సరం ఆరంభం రోజునే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శుక్రవారం ఉదయం నుంచి తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కావడం ప్రారంభమైంది. ఖాతాల్లో పడిన నగదు చూసుకుని తల్లిదండ్రుల్లో ఆనందం వెల్లివెరిసింది. గత వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని అమలు చేసినా ఒక్కో కుటుంబంలో ఒక్కరికే అమలు చేసింది. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పినట్లుగానే కూటమి ప్రభుత్వం ముగ్గురు, నలుగురు, ఐదుగురు పిల్లలు ఉన్న వారికి కూడా నగదు వేయడంతో ఆ కుటుంబాల్లో సంతోషాన్ని రెట్టింపు చేసింది. వైసీపీ నేతలు తల్లికి వందనం అమలుపై దుష్ప్రచారం చేయగా.. వాటిని పటాపంచలు చేస్తూ గతంలో చెప్పినట్లుగా పథకాన్ని అమలు చేయడంతో కూటమి శ్రేణులతో పాటు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లో తల్లిదండ్రులతో కలిసి కూటమి నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞత తెలిపారు. తల్లికి వందనం పేద కుటుంబాల్లో సంతోషాలను తీసుకొచ్చింది.



తల్లికి వందనం నగదు జమ చేయబడిన ముగ్గురు పిల్లలతో ఈమనికి చెందిన కంచర్ల రజిత

తల్లుల ఖాతాల్లో జమవుతున్న నగదు


- ఈపూరులో ఐదుగురున్న పిల్లల తల్లికి ఏకమొత్తంగా రూ.65 వేలు
- పిల్లలతో కలిసి హర్షం వ్యక్తం చేస్తోన్న తల్లిదండ్రులు
- సచివాలయాల వారీగా లబ్ధిదారుల జాబితాల ప్రదర్శన
- అభ్యంతరాల స్వీకరణకు వచ్చే నెల 5 వరకు గడువు



పెదకూరపాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

(గుంటూరు, గుంటూరు(విద్య), బాపట్ల - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల హామీలో ప్రధానమైన తల్లికి వందనం పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గురువారం జీవో విడుదల చేయగా ఆ తర్వాత నుంచి తల్లుల ఖాతాల్లో నగదు జమ అవడం ప్రారంభమైంది. శుక్రవారం ఉదయానికే గ్రామ/వార్డు సచివాలయాల్లో తల్లికి వందనం పథకానికి సంబంధించి అర్హులు, అనర్హుల జాబితాలను ప్రదర్శించారు. అలానే వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. వాటిని చూసుకుని అర్హుల జాబితాలో ఉన్న తల్లుల ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. కాసేపటికి (మిగతా 6వ పేజీలో)





ఆనందంగా స్కూలుకు వెళుతూ

8,199 మందికి ట్రిపుల్ ధమాక

తల్లికి వందనం పథకాన్ని కుటుంబంలోని పిల్లలందరికీ వర్తింప చేయడంపై అనుమానాలు వ్యక్తం చేసిన వారు కూడా ఆశ్చర్యపోయేలా తల్లుల ఖాతాల్లో ఏకమొత్తం గా నగదు జమ చేస్తున్నారు. ముగ్గురు పిల్లలు ఉన్న తల్లులకు ట్రిపుల్ ధమాక లభించింది. గుంటూరు జిల్లాలో 2131, పల్నాడు జిల్లాలో 4635, బాపట్ల జిల్లాలో 1433 మంది తల్లులకు ముగ్గురు/ అంతకంటే ఎక్కువమంది పిల్లలు ఉన్న తల్లులు 'తల్లికి వందనం' పథకానికి ఎంపికయ్యారు. వీరిలో పలువురికి నగదు జమ కూడా అయింది. ఒక్కో బిడ్డకు రూ.13 వేల చొప్పున ముగ్గురున్న వారికి రూ.39 వేలు, నలుగురు ఉన్న వారికి రూ.52 వేల నగదు బ్యాంకు ఖాతాల్లో జమైంది. పల్నాడు జిల్లా పరిధిలో ఈ పథకం ద్వారా పెద్దసంఖ్యలో తల్లులు లబ్ధి పొందినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ఐదింతలు..

ఈపూరు ఎస్సీ కాలనీకి చెందిన దారా సాగర్, మేరీ దంపతులకు ఐదుగురు సంతానం కాగా వారికి రూ.65 వేలు బ్యాంకు ఖాతాలో జమ కావడంతో వారి ఆనందం ఐదింతలైంది.

8 విత్తనాల విఫణిలో.. జిల్లాకు నకిలీ మరకలు
- భద్రాద్రి కొత్తగూడెంలో నకిలీ మిర్చి విత్తనాలు పట్టివేత
- మహబూబ్ నగర్‌లో దొరికిన బీటీ3 పత్తి విత్తనాలు
- రెండు తెలుగు రాష్ట్రాలకు గుంటూరు నుంచే సరఫరా
- నిద్రపోతున్న నిఘా వ్యవస్థ

22 అర్ధరాత్రి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె 6

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్ 6

ఏఎన్‌యూ పీజీ మూడో సెమిస్టర్ ఫలితాల విడుదల
- 20 వరకు పునఃమూల్యాంకనానికి అవకాశం

కొనసాగుతున్న కౌన్సెలింగ్

- మాన్యువల్‌గా నిర్వహించాలని మున్సిపల్ టీచర్ల డిమాండ్
- డీఈవో రేణుక హామీతో ఉపాధ్యాయుల ఆందోళన విరమణ
- నేటితో బదిలీ ప్రక్రియ ముగింపు.. 16న విధుల్లోకి ఉపాధ్యాయులు



సమావేశంలో కింద కూర్చుని ఆందోళన చేస్తున్న మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాల ఉపాధ్యాయులు

గుంటూరు(విద్య), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. అర్ధరాత్రి వరకు కూడా కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయులు జడ్పీ వద్ద రాత్రి పూట కూడా పడిగాపులు కాస్తున్నారు. మండల పరిషత్ యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలల్లో పని చేసే ఎస్జీటీలకు బదిలీల కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఆ తర్వాత మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ చేపట్టారు. పలు అవాంతరాలతో ఆయా ఉపాధ్యాయులు తమకు కూడా మాన్యువల్‌గానే బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. జడ్పీ సమావేశ మందిరంలోని కౌన్సెలింగ్ కేంద్రం వద్ద మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు పెదబాబు, డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన ఒత్తిడి కారణంగా ఇప్పటికే 80 శాతం మంది మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయులు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఆప్షన్లు పెట్టుకున్నారని దీనివల్ల వారికి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఉపాధ్యాయుల ఆందోళనతో స్పందించిన డీఈవో రేణుక మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. దీంతో ఉపాధ్యాయులు ఆందోళన విరమించారు. శనివారం మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా కౌన్సెలింగ్ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు ప్రకటించారు. సోమవారానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధుల్లో చేరతారని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు.

విస్తృత రుణాలకు వార్షిక ప్రణాళిక

- పంపిణీలో నూరు శాతం లక్ష్యాలు చేరుకోవాలి
- సీసీఆర్సీ కార్డుదారులకు రూ.200 కోట్లు ఇవ్వాలి
- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్య, అప్రాధాన్య రంగాలకు విస్తృతంగా రుణాల పంపిణీకి సంబంధించి వార్షిక ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. బ్యాంకర్ల జిల్లా స్థాయి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణాల పంపిణీలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నూరుశాతం చేరుకోవాలన్నారు. గత సంవత్సరంలో రైతులకు లక్ష సీసీఆర్సీ కార్డులను జారీ చేయగా అందులో కేవలం 23 వేల మందికి మాత్రమే రుణాలు మంజూరు చేశారన్నా రు. సీసీఆర్సీ కార్డుదారులకు ఈఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్లు రుణాలు ఇవ్వాలని, బ్యాంక్ బ్రాంచ్‌ల ప్రకారం లక్ష్యాలను నిర్దేశించాలని ఎల్‌డీఎంకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

- పీఎమ్ సూర్యఘర్ పథకంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి బ్యాంక్‌లు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల ఇళ్లకు మూడు యూనిట్ల స్థాపనకు నిర్దేశించడమైనదన్నారు. ఇందుకు రూ.78 వేలు సబ్సిడీ కింద వస్తుందన్నారు. దరఖాస్తుదారుడు వెండర్‌ను నిర్దేశించిన తర్వాత వెంటనే రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు తెలిపారు. జిల్లాకు 36 కిసాన్ డ్రోన్ యూనిట్లను లక్ష్యంగా ఇచ్చారని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, నాబార్డు డీడీఎమ్ రవికుమార్, ఆర్‌బీఐ ఎల్‌డీవో నవీన్‌బాబు, యూనియన్ బ్యాంక్ రీజనల్ అధికారి మాధురి, ఎల్‌డీఎం శివకృష్ణ పాల్గొన్నారు.



పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు

పచ్చిరొట్ట సాగుతో భూసారం

విత్తనాల పంపిణీలో వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు

కొల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట సాగుతో భూసారం పెరుగుతుందని తద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు తెలిపారు. కొల్లూరులోని రైతు సేవా కేంద్రం-2ను ఆయన శుక్రవారం సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వరి సాగు ఎప్పుడు ప్రారంభిస్తారు.. ఏయే రకాలను ఎక్కువ సాగు చేస్తున్నారని ఆరా తీశారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై పంపిణీ చేశారు. ఈ నెల 26వ తేదీ అనంతరం కాల్వలకు సాగునీరు విడుదల అవుతుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు, టీఎండీఎస్ విత్తనాలను తొలకరి వర్షాలు కురియగానే చల్లుకుని 45 రోజుల తర్వాత రోటావేటర్‌తో భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం గణనీయంగా పెరుగుతుందన్నారు. దీని వల్ల రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుందని చెప్పారు. డీ-కృషి యాప్ ద్వారా విత్తనాల పంపిణీ ఎలా జరుగుతుందనే అంశాన్ని పరిశీలించారు. మేక్ పేమెంట్ ఎప్పటికప్పుడు చేయాలని ఆలస్యం చేసే సిబ్బందిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రేపల్లె ఏడీఏ విజయబాబు, ఏపీసీడ్స్ డీఎం సుమలత, ఏవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నల్లపాడులో ఫ్రైట్ డిపో ప్రారంభం

- శిలాఫలకం ఆవిష్కరించిన రైల్వే జీఎం



డిపోని ప్రారంభిస్తున్న జీఎం అరుణ్‌కుమార్‌జైన్, డీఆర్ఎం సుధేష్ణసేన్

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు రైల్వే ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఫ్రైట్ డిపోని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ ప్రారంభించారు. శుక్రవారం గుంటూరు రైల్వే డివిజన్ పర్యటనకు వచ్చిన ఆయన తొలుత నల్లపాడు రైల్వే స్టేషన్‌ని సందర్శించారు. అక్కడ ఫ్రైట్ డిపోకి శిలా ఫలకం ఆవిష్కరించారు. ఇక నుంచి ఈ ఫ్రైట్ డిపోలో గూడ్స్ వ్యాగన్లను పరీక్షించి బీపీసీ సర్టిఫికెట్లను జారీ చేస్తారు. అలానే పాడైపోయిన వ్యాగన్లకు మరమ్మతులు నిర్వహిస్తారు. అనంతరం ఫ్రైట్ డిపో ఆవరణలో జీఎం మొక్కలు నాటారు.

సివిల్ సప్లయిస్ డీఎం బదిలీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సివిల్ సప్లయిస్ విభాగంలో ఇన్‌చార్జి జిల్లా మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాసరావును డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఎంగా బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు ఆరు నెలల నుంచి సివిల్ సప్లయిస్ డీఎం పోస్టు ఖాళీగా ఉండగా డీఎస్‌వోగా విధుల్లో ఉన్న విలియమ్స్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. నెలన్నర క్రితమే ఇన్‌చార్జి డీఎంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు స్వల్పకాలంలోనే వేరే జిల్లాకు బదిలీపై వెళ్లడం చర్చనీయాంశమైంది. ధాన్యం సేకరణలో భాగంగా ఖరీఫ్, రబీ రెండు సీజన్లు ఇన్‌చార్జి హోదా అధికారులతోనే పూర్తి కావడం గమనార్హం.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉమేష్, ఎస్ఐ ఆనంద్, సిబ్బంది

తెనాలి రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసలై గంజాయి విక్రయాలు చేస్తున్న నలుగురు ముఠాను రూ రల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులు, పట్టుకున్న గంజాయితో కేసు వివరాలను సీఐ ఉమేష్ వెల్లడించారు. తెనాలి మండలం సోమసుందరపాలేనికి చెందిన అలికిపల్లి సాంబిరెడ్డి, ఆటోనగర్‌కు చెందిన కూరగంటి చైతన్య, పెదరావూరుకు చెందిన పగడం మణి సింహారెడ్డి, తెనాలి ఐతానగర్‌కు చెందిన సుకుమార్ స్నేహితులు. వ్యసనాలకు బానిసలైన నలుగురూ డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయాలను ఎంచుకున్నారు. గుంటూరు కొత్తపేటకు చెందిన రత్తయ్య వద్ద నెలకోసారి గంజాయిని కొనుగోలు చేసి, తెనాలిలో చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి.. ప్యాకెట్ రూ. 500 వంతున విక్రయిస్తుంటారు. గురువారం రత్తయ్య వద్దకు నలుగురూ సాంబిరెడ్డి బైక్‌పై వెళ్లి కేజీ నాలుగు వందల గ్రామాలు గంజాయిని రూ.12,000 కొనుగోలు చేశారు. సుకుమార్ గుంటూరులోనే ఆగిపోవడంతో మిగిలిన ముగ్గురూ గంజాయితో తెనాలికి బయలు దేరారు. నందివెలుగు కూడలిలో రూరల్ సీఐ ఉమేష్, ఎస్ఐలు ఆనంద్, శ్రీనివాసరావు సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులను పట్టుకుని వారి వద్ద ఉన్న గంజాయిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న సుకుమార్, గంజాయి విక్రయించిన రత్తయ్యను అదుపులోకి తీసుకోవాల్సి ఉందని సీఐ ఉమేష్ పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ వి.చంగలరాయుడు, కానిస్టేబుల్ రవి, కపూర్ నాయక్, ఇంకోల్లు రవికుమార్ పాల్గొన్నారు.

గుత్తేదారి కనపడలేదా!

● అధ్వానంగా రేపల్లె-నిజాంపట్నం రహదారి ● అభివృద్ధికి రూ.9 కోట్లతో టెండర్
● మూడు నెలల నుంచి పనుల నిలుపుదల ● పట్టించుకోని అధికారులు..వాహనదారుల అవస్థలు



శింగుపాలెం వద్ద రహదారి గుంతలో ఇక్కట్లు



నిజాంపట్నం గ్రామం వద్ద రహదారిలో నిలిచిన వర్షపు నీరు

రేపల్లె, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలోని రేపల్లె-నిజాంపట్నం రహదారి అభివృద్ధికి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రూ.9 కోట్ల నిధులు మంజూరు చేశారు. రోడ్లు, భవనాలశాఖ అధికారులు టెండర్లు పిలవడంతో ఒంగోలుకు చెందిన కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. మూడు నెలలుగా రేపల్లె పట్టణం ఇసుకపల్లి నుంచి సజ్జావారిపాలెం వరకు రహదారిని తవ్వేసి బీటీ వేసి వదిలేశారు. దీంతో కంకరరాళ్లు బయటకు తేలి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాల రాకపోకల సమయంలో భారీగా దుమ్ము లేచి, వెనుకనుంచి వచ్చేవారికి రహదారి కనబడే పరిస్థితి లేకుండా ఉంది. సజ్జావారిపాలెం వద్ద సగం రహదారి తవ్వేసి వదిలేయడం, ఒక వైపు భారీ గుంతగా ఉండటం వల్ల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. రహదారి అంతా భారీస్థాయిలో గుంతలు పడటంతో వర్షపు నీరు, గృహాల వ్యర్థపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. శింగుపాలెం, పల్లపట్ల, నిజాంపట్నం గ్రామాల్లో పదేసి మీటర్ల పైనే గుంతలు ఉన్నాయి. కనీసం మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకున్నా ఆర్అండ్‌బీ అధికారులు అభివృద్ధిపై దృష్టిసారించిన దాఖలాలు లేవు. తక్షణమే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి రహదారి అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని తీరప్రాంతవాసులు కోరుతున్నారు.

మా అప్పు కడితే చాలు.. పార్టీతో సంబంధం లేదు

● సాయి కార్తిక్ సిటీ సెంటర్ రుణదాతల డిమాండ్



మాట్లాడుతున్న సాయి కార్తిక్ సిటీ సెంటర్ రుణ దాతలు

చిలకలూరిపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తమ వద్ద తీసుకున్న రూ. 7.5 కోట్ల మొత్తాన్ని తక్షణం తిరిగి చెల్లించాలని శుక్రవారం బాధిత రుణ దాతలు శుక్రవారం సాయి కార్తిక్ సిటీ సెంటర్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పట్టణానికి చెందిన కొందరు మీడియా ప్రతినిధులను వెంటతీసుకుని వెళ్లి సిటీ సెంటర్ వద్ద నివాసముంటున్న సెంటర్ భాగస్తుడు రావి సుధాకర్‌ను కలిశారు. కొద్ది రోజుల క్రితం రావి సుధాకర్, భార్య, కుమారుడు రావి మురళి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తమ సాయి కార్తిక్ సిటీ సెంటర్ భవనాన్ని టీడీపీకి చెందిన వారు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. తాము డబ్బు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ రుణ దాతలు వచ్చి తీసుకోవడం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో రుణ దాతలు ఎవరికి ఎంత అప్పులు ఉన్నారో తెలిపే పత్రాలను సుధాకర్‌కు చూపించారు. అయితే..ఈ బాకీలతో తనకు సంబంధం లేదని, తన కుమారుడు మురళీని అడగాలని సుధాకర్ సమాధానం ఇచ్చారు. అనంతరం బాధితులు కె.అంజిబాబు, తేలప్రోలు వీరయ్య చౌదరి, భీమినేని స్వాములు, సోమేపల్లి ప్రసాద్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ ప్రెస్ మీట్‌లో రావి సుధాకర్, మురళి తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. వారి భవనాన్ని తాము ఆక్రమించుకుంటే రావి సుధాకర్ అందులో ఎందుకు ఉంటారని ప్రశ్నించారు. వారి ఆస్తులతో తమకు సంబంధం లేదని చెప్పారు. ఈ విషయంలో టీడీపీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తమ డబ్బు తమకు ఇస్తే సమస్య పరిష్కారమవుతుందని తేల్చి చెప్పారు.

22 అర్ధరాత్రి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

గుంటూరు కార్పొరేషన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 22 నుండి మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగుతున్నట్లు ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్- టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.మధుబాబు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు గుంటూరు నగరపాలక సంస్థ ఇంచార్జి అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావుని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నగరపాలక, పురపాలక సంఘాల్లోని నాన్ పీహెచ్ విభాగంలోని ఔట్‌సోర్సింగ్ కార్మికులు జీతాలు పెంచాలని ప్రభుత్వానికి ఎన్నో వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు. యూనియన్ ఆధ్వర్యంలో 38 రోజులుగా సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంలోని సీడీఎంఏ రెండుసార్లు చర్చలు జరిపి.. పురోగతి లేకుండానే ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పడం జరిగిందన్నారు. మున్సిపల్ శాఖ మంత్రితో చర్చలు జరిపినా.. ఇదే సమాధానం వచ్చిందని వెల్లడించారు. కార్మిక సంఘాలన్నీ ఐక్య కార్యచరణ కమిటీగా ఏర్పడి ఈ నెల 9న వడ్డేశ్వరంలోని సీడీఎంఏ మురళీ కృష్ణకి సమ్మె నోటీసు ఇచ్చామని చెప్పారు. గుంటూరు నగరపాల సంస్థ కమిషనర్ అందుబాటులో లేకపోవడం వల్ల ఇన్‌చార్జి అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావుకి సమ్మె నోటీసు ఇచ్చామని చెప్పారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రాయపూడి కోటిబాబు, కార్యనిర్వహణ కార్యదర్శి గాలి ఏసుబాబు, కోశాధికారి నాగిపోగు సుమన్, కార్మికులు పాల్గొన్నారు.

గుంటూరు చానల్ మరమ్మతులు చేపట్టాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్



కాల్వను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

పెదకాకాని, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పశ్చిమ కృష్ణా డెల్టాలో ఉన్న ప్రధాన, పంట కాల్వల మరమ్మతులు వెంటనే చేపట్టి ఖరీఫ్ సీజన్‌లో నీటి పారుదలకు ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెదకాకాని సమీపంలోని గుంటూరు చానల్‌ను రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశ్చిమ కృష్ణా డెల్టాలో సుమారు 7 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగు చేస్తారని తెలిపారు. డెల్టాలో పంటలు బాగా పండాలంటే నీటిపారుదల సక్రమంగా జరగాలని పేర్కొన్నారు. కావున యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం పూడికతీత, తూటికాడ, గుర్రపు డెక్కను తొలగించాలని సూచించారు. 800 మరమ్మతుల పనులకు పనులు ప్రతిపాదించి, రూ. 48.27 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేసినప్పటికీ ఇప్పటి వరకు నిధులు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపక పోవడం దురదృష్టకరమన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు పుప్పాల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

18న ధ్యానబుద్ధ వద్ద యోగాంధ్ర

● 2వేల మంది లక్ష్యంగా ఏర్పాట్లు

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న ఉదయం 6 నుండి 8.30 గంటల వరకు ప్రసిద్ధ పర్యాటక కేంద్రం అమరావతిలోని ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద సుమారు రెండు వేల మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి మండల స్థాయి అధికారులతో కలసి ధ్యానబుద్ధ ప్రాజెక్టు, బుద్ధవనం ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజధాని అమరావతికి ఐకాన్‌గా ఉన్న ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద యోగా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు.. అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ యోగా కార్యక్రమంలో జిల్లా, డివిజన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామాల ప్రజలు, విద్యా సంస్థల నుండి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో కొండవీటి కోట, నాగార్జునసాగర్, కోటప్పకొండ వద్ద కార్యక్రమాలు నిర్వహించామని, అమరావతిలో జరిగే కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి రాజగోపాల్, తహసీల్దారు డానియేలు, ఎంపీడీఓ టి.పార్వతి, టూరిజం అధికారి జి.నాయుడమ్మ, ఈఓపీఆర్డీ కె పద్మజ, ఎంఈఓ శివబాబు, ఎస్ఐ అమీర్, సర్వేయర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

తల్లికి వందనం.. ఆనందం

(5వ పేజీ తరువాయి)

బ్యాంకుల నుంచి ఎస్ఎంఎస్‌ల ద్వారా నగదు జమైన ట్లు సందేశాలు రావడంతో చాలామంది సాయంత్రానికే ఏటీఎంలకు క్యూ కట్టారు. 14న రెండో శనివారం, 15న ఆదివారం వరుస సెలవుదినాలు కావడంతో శుక్రవారమే నగదు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. పాఠశాలలు, కళాశాలలు తెరవడంతో పిల్లలకు అవసరమైన ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు వంటివి కొనుగోలు చేసుకోవడానికి తల్లికి వందనం నగదు ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి సచివాలయాల వారీగా సోషల్ ఆడిట్ జరుగుతుందని అభ్యంతరాల స్వీకరణకు జూలై 5 వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి పథకం లబ్ధి అందేలా చూస్తామని అధికారులు తెలిపారు. తల్లికి వందనం పథకానికి అర్హులైన వారి జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు. ఇప్పటికే నగదు జమైన తల్లులు ఇంకా ఏవైనా అభ్యంతరాలుంటే సచివాలయాలలో తెలపాలని ప్రభుత్వం సూచించింది. అర్హత ఉండి పథకం అందని వారు వివరాలను సచివాలయాల్లో ఇస్తే త్వరలోనే డబ్బులు జమ అవుతాయని అధికారులు తెలిపారు. బ్యాంకు ఖాతాల విషయంలో తలెత్తిన సాంకేతిక చిక్కులను తొలగించుకోవడానికి పిల్లల తల్లులు దృష్టిపెట్టాలని అధికారులు కోరుతున్నారు. కొంతమంది తల్లుల ఖాతాల్లో నగదు జమ అయినా వారి బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడంతో రిఫండ్ వెళ్లిపోయాయని అధికారులు చెబుతున్నారు.

నాడు ఒకరికి.. నేడు అందరికీ

వైసీపీ హయాంలో ఎంతమంది పిల్లలున్నా ఒక్కరికే రూ.13 వేల నగదు జమ అయ్యేది. అయితే దీని వల్ల మిగిలిన పిల్లల చదువుల కోసం పేదలు ఇబ్బందులు పడుతుండటాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు గుర్తించారు. సూపర్‌సిక్స్ పేరుతో తీసుకువచ్చిన ఎన్నికల మ్యానిఫెస్టోలో తల్లికి వందనం పథకాన్ని చంద్రబాబు చేర్చారు. పైగా కుటుంబంలో ఒకరికి కాదు.. ఎందరు పిల్లలు ఉన్నా వారి చదువులకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు సహా కూటమి నేతలు ప్రకటించారు. తనకున్న బిడ్డలందరి చదువుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నగదు జమ అనడంతో గంపగుత్తగా మహిళలు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీలతో గెలిపించారు. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగానే కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ నగదు జమ చేయడంతో పేద కుటుంబాల్లో సంతోషాలు రెట్టింపయ్యాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 512.90 అడుగులు ఉంది. ఇది 136.64 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

'సంగం' వరి విత్తనాలు సిద్ధం

పొన్నూరు టౌన్(చేబ్రోలు), జూన్ 13(ఆంధ్రజ్యోతి): సంగం డెయిరి విత్తన పరిశోధన విభాగం ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన వరి విత్తనాలు సిద్ధం చేసినట్లు వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పర్యవేక్షణలో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కొన్నేళ్లుగా సంగం సీడ్ ప్రాజెక్టు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. విత్తన పరిశోధన అభివృద్ధి విభాగం రూపొందించిన మేలైన రకాలు ఎస్ఎస్ఆర్-2 పది కేజీల విత్తనాల సంచి రూ.750 , ఎస్ఎస్ఆర్-4 పది కేజీల సంచి రూ.750, బీపీటీ 5204 సర్టిఫైడ్ వరి విత్తనాలు 20 కిలోల సంచి రూ.940, ఫౌండేషన్ విత్తనాలు 20 కిలోలు రూ.1,020కు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు 93984 23590 నంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

వృద్ధుల సంరక్షణ వారసుల బాధ్యత

● న్యాయమూర్తి సయ్యద్ జియావుద్దీన్



మాట్లాడుతున్న జడ్జి సయ్యద్ జియావుద్దీన్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సమాజంలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, వారి సంరక్షణ బాధ్యత వారసులు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ సయ్యద్ జియావుద్దీన్ పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో నిర్వహించిన ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ, అవగాహన దినోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. వారసులకు ఇచ్చే ఆస్తుల గిఫ్ట్ డీడ్‌ను తమను సక్రమంగా చూడకపోతే రద్దవుతుందనే అంశాన్ని అందులో పొందుపరచాలని, దీంతో సత్ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం ద్వారా బాధిత వృద్ధులు.. న్యాయం పొందవచ్చని చెప్పారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, మానసిక వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, న్యాయవాది కాళిదాసు, మానవత నేతలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని పలువురి మృతి

వినుకొండటౌన్, జూన్ 13,(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నూజండ్ల మండలం పెద్దావరం గ్రామానికి చెందిన బండి నారాయణ (29) కుటుంబ సభ్యులతో కలిసి ప్రకాశం జిల్లా మేడపీ వెళ్లి ద్విచక్ర వాహనం తిరిగి స్వగ్రామం వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే నారాయణ మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడికి భార్య సైలు, 8 నెలల కుమార్తె ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

మాచర్ల పట్టణంలో..

మాచర్లటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని వివేకానంద ఆశ్రమం సమీపంలో నివాసముంటున్న ఇస్లావత్ సక్రునాయక్ (55) గురువారం రాత్రి ఆశ్రమ సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. వెల్దుర్తి మండలం శ్రీరాంపురం తండా నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న మేరాజ్యోత్ శివమణినాయక్, పోకూరు వేణు అతనిని ఢీకొన్నారు. సక్రునాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వట్టిచెరుకూరులో...

వట్టిచెరుకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చమళ్లమూడి, కాట్రపాడు గ్రామాల మధ్య గురువారం రాత్రి ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో మండలంలోని సోపాడు ఎస్సీ కాలనీకి చెందిన కాండ్రు కిరణ్ తేజ(22) ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు సీఐ రమా నాయక్ వెల్లడించారు. కాండ్రు కిరణ్ గురువారం రాత్రి గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. కాట్రపాడు వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. గుంటూరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమా నాయక్ తెలిపారు.

ఏఎన్‌యూ పీజీ మూడోవ సెమిస్టర్.. ఫలితాల విడుదల

●20 వరకు పునఃమూల్యాంకన దరఖాస్తుకు అవకాశం

పెదకాకాని, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ మూడవ సెమిస్టర్ పలు కోర్సుల పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఏఎన్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు ఫలితాలను వెల్లడించారు. సీఈ ఆలపాటి శివప్రసాదరావు మాట్లాడుతూ ఎంఏ మ్యూజిక్, ఇంగ్లీష్, ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్), ఎంఎస్సీ ఎలక్ట్రానిక్స్, ఫోరెన్సిక్ సైన్సెస్, హార్టికల్చర్, ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ కోర్సుల ఫలితాలను ప్రకటించినట్లు తెలిపారు. పునః మూల్యాంకనం కోసం ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఫలితాల పూర్తి వివరాలు ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్య

వట్టిచెరుకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్నెపాడు గ్రామానికి చమట శివయ్య(52) అనే కౌలు రైతు అప్పుల భారంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి కుమారుడు విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసినట్లు సీఐ రమా నాయక్ శుక్రవారం తెలిపారు. మండలంలోని కొర్నెపాడు గ్రామానికి చెందిన చమట శివయ్య నాలుగేళ్లుగా ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశారు. సరైన దిగుబడి, ధర లభించక సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు కావడంతో.. గత కొద్ది రోజులుగా తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు. గురువారం అర్ధరాత్రి శివయ్య పురుగు మందు తాగి, వాంతులు చేసుకుంటుండగా.. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ రమా నాయక్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

38,365 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 36,095 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 38,365 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 3,866 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11200
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13000	334	9500	13500
273	10000	12500	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	----	-----
4884	---	---	341	10000	14000
సూపర్ 10	---	---	సూపర్ 10	--	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14200	తేజ	10000	14600
షార్క్-1	------	------	బ్యాడిగి	10000	13400
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

జిల్లా అగ్నిమాపక శాఖాధికారిగా వినయ్‌కుమార్



కె.వినయ్‌కుమార్ →

బాపట్లరూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అగ్నిమాపక శాఖాధికారిగా కె.వినయ్‌కుమార్ శుక్రవారం పదవీ బాధ్యతలను చేపట్టారు. గతంలో పనిచేసిన మాదవనాయుడు సత్యసాయి జిల్లాకు సాధారణ బదిలీలలో భాగంగా బదిలీపై వెళ్లారు.

అగ్నిమాపకాధికారిగా సిద్ధార్థ



గంటా రామసిద్దార్థ

బాపట్ల,జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల అగ్నిమాపకాధికారిగా గంటా రామ సిద్ధార్థ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో కావలిలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలలో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటేశ్వరరావు రేపల్లె బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సిద్ధార్థను సిబ్బంది అభినందించారు.

అమృతలూరు సీడీపీవోగా లక్ష్మీదేవి



ఏ.లక్ష్మీదేవి

అమృతలూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా ఏ.లక్ష్మీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన విజయలక్ష్మి బదిలీపై గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు. దీంతో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి లక్ష్మీదేవి అమృతలూరు ప్రాజెక్టు సీడీపీవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు ఆమెకు స్వాగతం పలికారు.

మండల వ్యవసాయ శాఖ అధికారిగా ప్రేమ్‌సాగర్



ప్రేమ్‌సాగర్

వేమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వేమూరు మండల వ్యవసాయ శాఖ అధికారిగా ప్రేమ్‌సాగర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు పని చేసిన అధికారిణి సునీత వట్టిచెరుకూరు మండలానికి బదిలీ కావడంతో తెనాలి మండలంలో పని చేస్తున్న ప్రేమ్‌సాగర్ వేమూరు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వ్యవసాయ శాఖ ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికారు.



పాతనేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు

నేరాలు పునరావృతమైతే కఠిన చర్యలు

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు

బాపట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా తయారీ కార్యకలాపాలు పునరావృతం అయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని స్టూవర్టుపురం, బేతపూడి గ్రామాలలో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం విస్తృత దాడులు నిర్వహించారు. అనంతరం గ్రామాలలో పాతనేరస్తులు, పీడీ యాక్ట్ ముద్దాయిలను వారి కార్యకలాపాలు, జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇకపై ఎటువంటి నాటుసారా కార్యకలాపాలు చేయవద్దు అని సూచించారు. అలా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ సలీమా, మంగళగిరి ఇన్‌స్పెక్టర్ బాలనరసింహం, ఒంగోలు ఇన్‌స్పెక్టర్‌లు రామారావు, నరహరి, బాపట్ల సీఐ పి.గీతిక, ఎస్‌ఐలు ఎస్.మౌనిక, శ్రీనివాసరావు, వీఆర్వో మేకల వలిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాటుసారా తయారి పాతనేరస్తులను తహసీల్దార్ షేక్ సలీమా ఎదుట హాజరు పరిచారు.

క్రీడా ప్రతిభ కనబరిచిన కృష్ణారెడ్డికి ఘన సన్మానం

బాపట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : బీచ్ కబడ్డీ పోటీలో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన కావూరి కృష్ణారెడ్డిని శుక్రవారం మున్సిపల్ హైస్కూల్‌లో సన్మానించారు. గత నెలలో బీహార్‌లో నిర్వహించిన బీచ్ కబడ్డీ కేలో ఇండియా పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి బ్రౌంజ్‌మెడల్ తీసుకొచ్చాడు. ఈనెల 8వ తేదీ వరకు మచిలీపట్నంలో నిర్వహించిన 12వ నేషనల్ బీచ్ కబడ్డీ పోటీలలో రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించి ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రానికి గోల్డ్‌మెడల్ తీసుకొచ్చారు. కబడ్డీలో రాష్ట్ర కీర్తిని దేశవ్యాప్తంగా తెలియజేసిన కృష్ణారెడ్డిని బాపట్ల కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరి మంతెన సుబ్బరాజు, విశ్రాంత పీడీ ప్రసాదరావు, సంగీత ప్రసాద్‌లను కూడా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, పీడీ కత్తి శ్రీనివాసరావు, మరకా సాయికుమార్, కోచ్ శైలజ, పీడీ రవి, సీనియర్ క్రీడాకారుడు తిరుమలశెట్టి సాంబశివరావు, పూలనాగులు, గంగాధర్, విజయ్, సాయినరేంద్ర, శ్రీను, జనార్దనరెడ్డి, వెంకటేష్, కబడ్డీ క్లబ్ మెంబర్స్, జిల్లా అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



మెడల్స్ సాధించిన కావూరి కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, ప్రముఖులు

నిస్వార్థంగా సేవలు అభినందనీయం

● మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర

బాపట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : యోగా గురువులుగా నిస్వార్థ సేవలందించటం అభినందనీయమని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. పట్టణంలోని బీమావారిపాలెంలో సమగ్రయోగ శిక్షణా కేంద్రం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి తాండ్ర సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొని యోగా గురువు ధూళిపాళ్ళ శైలజను సత్కరించి సన్మానించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గురజాల శ్రీనివాసరావు, పుట్టా ఆదిశేషారెడ్డి, వెంకటకృష్ణారావు, సుంకర శేషగిరిరావు పాల్గొన్నారు.



యోగా గురువు ధూళిపాళ్ళ శైలజను అభినందిస్తున్న తాండ్ర సాంబశివరావు

సంఘటన స్థలంలోనే మృతదేహాలకు పోస్ట్‌మార్టం

బాపట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శిఖరంవారి వీధిలో అన్నదమ్ములైన బొడ్డుపల్లి బాలసుబ్రహ్మణ్యం, బొడ్డుపల్లి వెంకటసుబ్బయ్యశాస్త్రిల మృతదేహాలకు శుక్రవారం పోస్ట్‌మార్టం నిర్వహించారు. పట్టణ సీఐ ఆర్.రాంబాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐ విజయ్‌కుమార్, వైద్యులు, రెవెన్యూ సిబ్బంది కలిసి సంఘటన స్థలంలోనే పోస్ట్‌మార్టం చేయించారు. మృతదేహాలు కుళ్ళిపోవటం వల్ల ఆసుపత్రికి తీసుకెళ్ళలేని పరిస్థితి కావటంతో ఈవిధంగా చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని సీఐ రాంబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బాపట్లరూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మహిళా మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాపట్ల రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పొన్నూరుకి చెందిన పి.కుమార్‌రాజు, కృపావతి అనే ఇద్దరు ఈనెల 9న ద్విచక్రవాహనంపై బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి వచ్చి తిరుగు ప్రయాణంలో పొన్నూరుకు వెళుతుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో కృపావతి (35) తలకు తీవ్ర గాయం అవ్వటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఆమె మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేయటం జరిగిందని రూరల్ పోలీసులు తెలిపారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి ఎమ్మెల్యేకు తమ సమస్యలను వివరించారు. పెన్షన్‌ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు అర్జీలు అందజేశారు. ఉద్యోగావకాశాలు కల్పించాలని యువత విజ్ఞప్తి చేశారు. విద్య, వైద్యసాయం కోసం అనేక మంది అర్జీలు అందజేశారు. తాము ఎదుర్కొంటున్న కష్టాలు నుంచి గట్టెక్కించాలని అభ్యర్థించారు. అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అర్జీదారులు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే నరేంద్రవర్మకు సమస్యలు వివరిస్తున్న బాధితులు

ఖాతాలో డబ్బులు జమ.. ప్రభుత్వానికి తల్లులు వందనం



విద్యార్థిని రంజితతో కలిసి సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు ఆదినారాయణ, నిరూష



డబ్బులు జమకావటంతో ప్రధానోపాధ్యాయుడు వరకుమార్‌కు చెప్పి సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థినీలు మానస, శోభారాణి

బాపట్ల రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలలో శుక్రవారం డబ్బులు జమ కావటంతో వారంతా ప్రభుత్వానికి వందనాలు చెబుతున్నారు. ఒకే కుటుంబంలో చదువుకునే వారందరికి డబ్బులు జమ చేయటం సంతోషదాయకమని హర్షం వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల పట్టణంలోని సూర్యలంక రోడ్డులో గల సరస్వతీ మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో నరసాయపాలెం గ్రామానికి చెందిన కసుకుర్తి మానస, కసుకుర్తి శోభారాణిలు చదువుకుంటున్నారు. వీరిద్దరికి తల్లికి వందనం డబ్బులు జమ కావటంతో వారి తల్లిదండ్రులు కిషోర్‌బాబు, కీర్తి రాణిలు సంతోషం వ్యక్తం చేశారు. అదే విధంగా నరాలశెట్టిపాలేనికి చెందిన ముత్యాల మోహనరూప, మోహనషణ్ముఖలకు కూడా డబ్బులు జమ కావటంతో తల్లిదండ్రులు మధు, శిరీషలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వరకుమార్‌కు చెప్పి సంతోషించారు. మున్సిపల్ హైస్కూల్‌లో చదువుతున్న గూడంశెట్టి రజిత తల్లి ఖాతాలో డబ్బులు జమకావటంతో తల్లిదండ్రులు ఆదినారాయణ, నిరూషలు స్కూల్‌కు వచ్చి ఉపాధ్యాయులకు చెప్పి ఆనందం వ్యక్తం చేశారు.

మూడు సచివాలయాల పరిధిలో 1617 మంది

కొల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు గ్రామ పరిధిలోని మూడు సచివాలయాల కింద మొత్తం 1617 మంది తల్లికి వందనం లబ్దిదారులు ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శి బి.మల్లికార్జున శుక్రవారం పేర్కొన్నారు. సచివాలయం-1 కింద 683 మంది, సచివాలయం-2 కింద 470 మంది, సచివాలయం-3 కింద 464 మంది తల్లికి వందనం లబ్దిదారులు ఉన్నారని, వారందరి ఖాతాల్లో ఇంటిలో ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే వారందరికి కూడా నగదు జమ అవుతుందని తెలిపారు. అనర్హుల జాబితాలో ఉన్న వారు మాత్రం తమకు నగదు జమ కాలేదని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, వారందరికి తగిన కారణాల వలన తల్లికి వందనం పథకానికి అనర్హులని సిబ్బంది వివరిస్తున్నట్లు చెప్పారు.

సంతమాగులూరు మద్యం షాపు లైసెన్స్ రద్దు

● జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు

బాపట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సంతమాగులూరు మండలంలోని జీఎస్.ఎల్ నెంబరు బీపీఎల్ /98 షాపు లైసెన్స్ రద్దు చేసినట్లు జిల్లాప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. లైసెన్స్ దారులు ప్రభుత్వానికి ఫీజు చెల్లించకపోవటంతో రద్దు చేసినట్లు చెప్పారు. దీనికి సంబంధించి నూతన లైసెన్స్ ఇవ్వటానికి దరఖాస్తులు స్వీకరణకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దరఖాస్తు చేయదల్సిన వారు జిల్లాలోని అద్దంకి, బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం, చీరాల, పర్చూరు ఎక్సైజ్ స్టేషన్‌లలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్దతిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడుతాయన్నారు. 21వ తేది ఉదయం 8గంటలకు కలెక్టరేట్ ఆవరణంలో డ్రా తీస్తామన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు

బాపట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా వేటగిరి శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ కార్యాలయంలో శుక్రవారం పమిడిబోయన రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై దశల వారీగా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ముత్తిరెడ్డి శ్రీనివాస్, జెల్డి రత్నకుమారి, పొట్లూరి అంకమ్మరావు, మాదాల యలమందయ్య, ఏసుబాబు, సరోజినీ, తన్నీరు ర్యాన్, దోనేపూడి రవి పాల్గొన్నారు.

వాహనదారులు ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలి

● బాపట్ల పట్టణ ఎస్‌ఐ చంద్రావతి

బాపట్లరూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు తమ వెంట వాహన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని బాపట్ల పట్టణ ఎస్‌ఐ చంద్రావతి వాహనదారులకు సూచనలు చేశారు. బాపట్ల పట్టణం పాతబస్టాండ్ ఆవరణలోని టౌన్ సీఐ రాంబాబు ఆదేశాల మేరకు శుక్రవారం వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని సిబ్బందితో కలిసి చేపట్టారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ఆమె మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. వాహనదారులు రోడ్డుభద్రతా నియమాలను పాటించాలన్నారు. మైనర్‌లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు.



పాతబస్టాండ్ ఆవరణలో వాహనాలను తనిఖీ చేస్తున్న బాపట్ల పట్టణ ఎస్‌ఐ చంద్రావతి

శ్రీబండ్లమ్మ అమ్మవారి కొలుపులు



శ్రీబండ్లమ్మ అమ్మవారు

పిట్టలవానిపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం గ్రామంలో ఉన్న గ్రామ దేవత శ్రీబండ్లమ్మ అమ్మవారి కొలుపుల మహోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 7 గంటలు నుండి చద్ది నైవేద్యాల కార్యక్రమంతోపాటు ఉదయం 8 గంటలు నుండి కనకదుర్గమ్మతల్లిని దండుబాటు దగ్గర నుంచి కనకతప్పెట్లుతో ఊరేగింపుగా తీసుకొని వచ్చి కనకదుర్గమ్మతల్లికి పొంగళ్ళు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని శ్రీబండ్లమ్మ అమ్మవారికి పూలు నిర్వహించారు.

అధ్వానంగా జమ్ములపాలెం-నరసాయపాలెం రహదారి

బాపట్లరూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెం గ్రామం నుంచి నరసాయపాలెం గ్రామానికి వెళ్ళేందుకు ఉన్న రోడ్డు పూర్తి స్థాయిలో ధ్వంసమై గులకరాళ్ళు పైకి తేలటంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం రెండు గ్రామాల మధ్య రాకపోకలు సాగే ఈ రహదారి పూర్తి స్థాయిలో ధ్వంసం అవ్వటంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. రాత్రి సమయాలలో ఈ రహదారిపై ద్విచక్రవాహనదారులు వెళుతూ ప్రమాదాలకు గురై గాయాల పాలౌతున్నారు. సంబంధితాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారికి మరమ్మతులు జరిపించాలని చెరువు జమ్ములపాలెం, నరసాయపాలెం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



జమ్ములపాలెం-నరసాయపాలెం గ్రామాల మధ్య ధ్వంసమైన రోడ్డు

వైసీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా మౌలాలి

పిట్టలవానిపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు వైసీపీలో మంచి భవిష్యత్తు ఉంటుందని పిట్టలవానిపాలెం మండల మాజీ ఎంపీపీ షేక్ బాజి అన్నారు. మండలంలోని చందోలు గ్రామానికి చెందిన షేక్ మౌలాలిని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించటంపై శుక్రవారం నాయకులు పూలమాలలతో, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రహదార్ల మాజీ డైరెక్టర్ షేక్ హుస్సేన్, చందోలు గ్రామ వైసీపీ అధ్యక్షుడు అమీర్‌ఖాన్, చందోలు గ్రామ సర్పంచ్ గౌరిదేవి విజయకుమారి మునీర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాధాకృష్ణ మిత్ర కిట్ అందజేత

కర్లపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం ఏట్రవారిపాలెం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్, రాధాకృష్ణన్ యూనిఫామ్, బుక్స్‌ను గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు ఎం.జ్యోతి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్, ఓటికొండ కొండలమ్మ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షం కురిస్తే బురదమయం... పనిచేయని వాటర్‌ప్లాంట్

● బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థుల ఇక్కట్లు

బాపట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ మొత్తం వర్షం పడితే బురదగా మారుతున్నది. కొద్దిపాటి వర్షానికి కూడా నీరు నిలిచి చిత్తడిగా తయారౌతుంది. అయినప్పటికి అధికారులు ఏవిధమైన చర్యలు తీసుకోవటంలేదని విద్యార్థులు, తల్లిదండ్రులు అంటున్నారు.

స్కూల్ నుంచి బయటకు రావాలంటే విద్యార్థులు బురదలో నుంచి నడవాల్సి వస్తున్నది. గ్రౌండ్‌లోని గుంతలను పూడ్చి నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. అదేవిధంగా విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ పనిచేయటం లేదు. దీనివల్ల బయట నుంచి వాటర్ ట్యాంక్ తెచ్చుకొని విద్యార్థులకు అందిస్తున్నారు. అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బాపట్ల మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో వర్షపునీరు నిలిచి బురదగా మారిన చిత్రం



మున్సిపల్ హైస్కూల్‌లో పని చేయని వాటర్ ప్లాంట్

అన్నదానాన్ని ప్రారంభించిన మోపిదేవి

రేపల్లె,జూన్ 13(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలిగితే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. నిజాంపట్నంలోని గ్రామదేవత అయిన మొగదారమ్మతల్లి తిరునాళ్ళ అనంతరం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. గ్రామాలు సుభిక్షంగా ఉండాలంటే గ్రామదేవతను పూజించాలని అన్నారు. ఎన్నో ఏళ్ళ నుంచి కొలువై ఉన్న మొగదారమ్మ తల్లి ఎంతో దయగలదని, ప్రజలు నిత్యం ఆమె సన్నిధిలో పూజలు చేస్తుంటారని తద్వారా గ్రామం సుభిక్షంగా ఉంటుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి హరనాథబాబు, ప్రసాదం వాసుదేవ, గ్రామస్థులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యమాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి మోపిదేవి

కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో సుభిక్ష పాలన

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా

భట్టిప్రోలు (కొల్లూరు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతో గత సంవత్సర కాలంలో రాష్ట్రంలో సుభిక్ష పాలన కొనసాగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. భట్టిప్రోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయ ఆవరణలో ప్రభుత్వ ఏడాది పాలనపై శుక్రవారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల సమక్షంలో సాయిబాబా భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరాచక పాలన ఎదుర్కొన్న ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని వారి ఆశలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సంవత్సర కాలంగా రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఖరీఫ్ సాగుకు ముందుగానే రైతన్నకు తోడు పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ యడ్ల జయశీలరావు, పార్టీ నాయకులు కంభం సుధీర్, బసవపున్నయ్య, పాండు రంగారావు, భవన్నారాయణ, బాబురావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా

భగవద్గీత పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన మాధవి

● శృంగేరి ఉత్తర పీఠాధిపతి చేతుల మీదుగా సత్కారం



శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖరేంద్ర భారతి స్వామి చేతుల మీదుగా సత్కారం అందుకుంటున్న మాధవి

వేమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వేమూరు మండలం కుచ్చెళ్లపాడు గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక ప్రచారకర్త తాడికొండ మాధవి శృంగేరిలో నిర్వహించిన భగవద్గీత పోటీలలో ప్రథమ శ్రేణిలో నిలిచి పీఠాధిపతి భారతీతీర్థ స్వామి ఆశీర్వచనాలతో ఉత్తర పీఠాధిపతి విధుశేఖరేంద్ర భారతి స్వామి చేతుల మీదుగా శుక్రవారం శృంగేరిలో సత్కారాన్ని అందుకున్నారు. 18 అధ్యాయాలలో పరీక్ష నిర్వహించగా మాధవి ప్రథమ శ్రేణిలో గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా ఆమెకు శృంగేరి పీఠం ద్వారా అభినందన పత్రం, శ్రీకృష్ణుని చిత్రపటం అందించిన స్వామీజీ మంగళా శాసనాలతో ఆశీర్వదించారు. 2024లో మైసూరు దత్త పీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానంద స్వామి ఆలిండియా స్థాయిలో నిర్వహించిన భగవద్గీత పోటీలలో మాధవి ప్రథమ శ్రేణిలో గుర్తింపు పొంది గోల్డ్ మెడల్ సాధించింది. కుచ్చెళ్లపాడు గ్రామానికి చెందిన భజన సంఘాల వారు, గ్రామ ప్రజలు, జంపని, వేమూరు గ్రామాలకు చెందిన తిరుమల తిరుపతి దేవస్థానంలో దాససాహిత్య ప్రాజెక్టు భజన సంఘాల వారు మాధవికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 33కేవీ గంగడిపాలెం 33కేవీ ఫీడర్‌లలో విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని ఆ శాఖ డీఈఈ డి.శ్యామ్‌సుధాకర్‌బాబు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రేపల్లె పట్టణంలోని 28 వార్డులు, రేపల్లెరూరల్ మండల పరిదిలోని 28 పంచాయతీ గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భట్టిప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో...

భట్టిప్రోలు (కొల్లూరు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శాంతకుమారి శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని వెల్లటూరు, భట్టిప్రోలు, అద్దేపల్లి, ఐలవరం, సూరేపల్లి, వేమవరం, కోనేటిపురం, పడమటివారిపాలెం, తాతావారిపాలెం, పల్లెకోన, ఆక్లమూడి, రాచూరు, జంపనివారిపాలెం గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

నేడు పెనుగుదురుపాడు ఫీడర్‌లో...

చుండూరు (వేమూరు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : చుండూరు మండలం పెనుగుదురుపాడు ఫీడర్‌లో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. పెనుగుదురుపాడు, శ్రీరంగపురం గ్రామాలలో మరమ్మతులు చేపడతామని తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

బాపట్ల,జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నుంచి చెన్నై వైపు వెళుతున్న రైలు నుంచి జమ్ములపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద బీహార్‌కు చెందిన వ్యక్తి జారిపడిన సంఘటన శుక్రవారం జరిగింది. రైల్వే సిబ్బంది క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రెడిట్ పొందారు..!

సూపర్ సిక్స్‌లో..తల్లికి వందనం పథకాన్ని కూటమి ప్రభుత్వం దిగ్విజయంగా అమలు చేసింది. హామీ ప్రకారం ఎంతమంది పిల్లలు బడికెళ్తే.. అంతమందికీ.. రూ.13 వేలు లెక్కన వారి తల్లుల ఖాతాల్లో జమ చేసి.. మాట నిలబెట్టుకున్న క్రెడిట్ పొందింది. బడి గంట మోగిన వెంటనే పిల్లల ఖర్చులెలా అని ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు.. తమ ఖాతాలో పథకం డబ్బులు క్రెడిట్ కావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు పిల్లల వారి ఆనందానికి ఇక హద్దులు లేవు. కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలుపుకున్నారు.

ఒకే కుటుంబంలో నలుగురికి, మరో కుటుంబంలో ముగ్గురికి



సలోమాను, ఫాతిమా కుటుంబం



గల్లా పిచ్చహరి, మల్లేశ్వరి కుటుంబం

మాచవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు విడుదల చేసిన తల్లికి వందనం జాబితాలతో ఆయా గ్రామాల్లో ఆనందోత్సాహాలు వ్యక్త మవుతున్నాయి. కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం ఇస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు తల్లికి వందనం పథకం మంజూరు చేయడంతో తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్త పరుస్తున్నారు. మాచవరం మండలంలోని వేమవరం గ్రామానికి గల్లా సలోమాను, గల్లా పాతిమా అనే దంపతులకు ఐదుగురు సంతానం. వీరిలో నలుగురు జాబితాలో రాగా మరొకరు 10వ తరగతి అయి పోవడంతో ఈ నెల 30న మరో జాబితాలో అమ్మాయి రానున్నది. దీనిని బట్టి కుటుంబంలో ఉన్న ఐదుగురు పిల్లలకు తల్లికి వందనం వర్తిస్తుంది. అదే విధంగా అదే గ్రామానికి చెందిన గల్లా పిచ్చహరి, గల్లా మల్లేశ్వరి దంపతులకు నలుగురు సంతానం. వీరిలో ముగ్గురు పేర్లు జాబితాలో వచ్చాయి. మరొక అమ్మాయి 10వ తరగతి పాసవ్వటంతో ఈ నెల 30వ తేదీన విడుదల కానున్న మరో జాబితాలో రానున్నది. దీనిని బట్టి వారి కుటుంబంలో కూడా నలుగురికి తల్లికి వందనం వర్తిస్తుంది. ఇలా అనేక మంది కుటుంబాల వారికి ముగ్గురు నుంచి నలుగురు పిల్లలకు తల్లికి వందనం వర్తించే విధంగా అవకాశాలు మెండుగా ఉన్నాయి. మొత్తం మీద తల్లికి వందనం జాబితాలు రిలీజ్ చేయటంతో ఆయా గ్రామ సచివాలయాల్లో సందడి నెలకుంది.

ఇచ్చిన హామీ పక్కాగా అమలు



తుళ్లూరు, జూన్ ,(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడిచ్చిన తల్లికి వందనం పక్కాగా అమలు చేసింది. ఇంటిలో ఎంత మంది చదువుకునే పిల్లలు ఒకటవ తరగతి నుంచి పన్నెండవ తరగత వరకు విద్యార్థులుంటే అంత మందికి సంత్సరానికి రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో శుక్రవారం నుండి జమ కావడం ప్రాంరంభమైంది. మండల పరిధిలోని ఐనవోలు గ్రామానికి చెందిన ఒకే ఇంటిలోని పోతు రాజు ప్రవీణ్ , శివసేంద్, లాస్యకు తల్లికి వందనం పథకం కింద ఖాతాలో డబ్బులు జమ అయినట్లు కూటమి నాయకులు తెలిపారు. పథకం పార దర్శకంగా అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గుంటూరు ఎంపీ, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమాలకు కూటమి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. పేదల పక్షాన నిలబడి కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, జనసేన మండల అధ్యక్షుడు యర్ర గోపు నాగరాజు , బీజేపీ అధ్య క్షుడు నీరుకొండ లక్ష్మీ నారాయణలు పేర్కొన్నారు.

పార్టీలకతీతంగా వలంటీర్ కుటుంబానికి నగదు జమ



ముగ్గురు పిల్లలతో కూనల రామయ్య



ముగ్గురు పిల్లలతో తల్లిదండ్రులు గంగారం సుభాని, గౌసియా

ముప్పాళ్ళ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా తల్లికి వందనం నగదును విద్యార్థుల తల్లి దండ్రుల ఖాతాలో శుక్రవారం జమ చేసింది. ఒకే ఇంటిలో ముగ్గురు విద్యార్థులు చదువుతున్నా వారందరికీ తల్లికి వందనం పథకంలో భాగంగా డబ్బులను తల్లుల ఖాతాల్లో నగదు వేశారు. పార్టీలకు అతీతంగా వలంటీర్ కుటుంబ సభ్యులకు నగదు వారి ఖాతాలో జమ అయ్యింది. దీంతో గ్రామాలలో తల్లుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గతంలో ఇంటిలో ఎంతమంది చదువుతున్నా ఒక్కరికి మాత్రమే వైసీపీ ప్రభుత్వం ఇచ్చింది. రుద్రవరం ఎస్సీ కాలనీకి చెందిన కూనల రామయ్య, సుజాత లకు ముగ్గురు సంతానం కాగా గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో పెద్దకూతురు సంజన 5వత˝రగతి, రెండవ అమ్మాయి మోక్ష 3వ తరగతి, కొడుకు రక్షణ్ తేజ్ 1వతరగతి గతేడాది చదివారు. ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం రావడంతో తండ్రి రామయ్య ఆనందం వ్యక్తం చేశారు. ముప్పాళ్ళకు చెందిన షేక్ గంగారం సుభాని, గౌసియా దంపతులకు ముగ్గురు పిల్లలు పెద్దకుమార్తె ముప్పాళ్ల హైస్కూల్‌లో ఆసియా 10వ తరగతి, కుమారుడు ఆసిఫ్, నరసరావు పేటలోని ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి, మరో కుమారుడు అర్షద్ ముప్పాళ్ళలోని ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. వీరికి తల్లికి వందనం నగదు ఖాతాలో జయ అయ్యింది. మండలంలోని నార్నెపాడులో నాయుడు శ్రీను, నాగాంజలిల ముగ్గురు పిల్లల వెంకటేష్ 7వ తరగతి, షన్ముఖ సాయి 5వ తరగతి, రమ్యశ్రీ 2వ తరగతి గ్రామంలోని ప్రైవేటు పాఠశాల జీఎంఆర్ మెమోరియల్‌లో చదువుతున్నారు. వారికి కూడా తల్లికి వందనం పథకం వర్తించి ఖాతాలో నగదు పడింది. గ్రామాల్లో పాఠశాలలు పునఃప్రారంభం రోజునే.. తల్లికి వందనం జమకావడంతో తమ పిల్లలను సంతోషంగా ఏ కష్టం లేకుండా చదివించుకుంటామని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



షేక్ బుజ్జి, భర్త సుభానీతో ముగ్గురు పిల్లలు

సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం

పెదకూరపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతక మందికి కూటమి ప్రభుత్వం శుక్రవారం నగదును జమ చేసింది. పెదకూరపాడుకు చెందిన షేక్ బుజ్జి భర్త సుభానీలు, తమ ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం పథకం నగదు రావడం తమకెంతో ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. షేక్ ఆసీఫా తనకు ఉన్న ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం పథకం ద్వారా నగదు జమ అయిందని తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే ప్రవీణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

విత్తనాల విఫణిలో.. జిల్లాకు నకిలీ మరకలు

- భద్రాద్రి కొత్తగూడెంలో నకిలీ మిర్చి విత్తనాలు పట్టివేత
- మహబూబ్ నగర్‌లో దొరికిన బీటీ3 పత్తి విత్తనాలు
- రెండు తెలుగు రాష్ట్రాలకు గుంటూరు నుంచే సరఫరా
- నిద్రపోతున్న నిఘా వ్యవస్థ

గుంటూరు సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గుంటూరులో తయారువుతున్న నకిలీ విత్తనాలు రెండు తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్నాయి. మొన్న తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో నకిలీ పత్తి విత్తనాలు దొరికితే.. నేడు భద్రాద్రి కొత్త గూడెంలో నకిలీ మిర్చి విత్తనాలు దొరికాయి. ఈ విత్తనాలు గుంటూరు విత్తనాల షాపులోనే విక్రయించినట్లు అక్కడి పోలీసులు తేల్చారు. గుంటూరు నగర పరిసర ప్రాంతాల్లోనే నకిలీ విత్తనాల మాఫియా పెద్ద ఎత్తున నిల్వలు తయారు చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడం దృష్టి సారించాల్సిన అంశం. ఎక్కడెక్కడి నుంచో విత్తనాలు తీసుకువచ్చి ఇక్కడ కొత్తగా ప్యాక్ చేసి.. మార్కెట్ లోకి విడుదల చేస్తున్నారు.

రాణీ బెంగళూరు నుంచి తెచ్చి

కర్ణాటకలోని రాణీ బెంగళూరులో ఎక్కువగా మిర్చి విత్తనాల ప్రాసెసింగ్ జరుగుతుంది. అక్కడ ప్రముఖ కంపెనీలు ఫెయిల్ అయిన విత్తనాలను లూజ్‌లో విక్రయిస్తాయి. కేజీ కేవలం రూ. 6 వేల నుంచి రూ. 10 వేల వరకు విక్రయిస్తారు. వాటిని ఇక్కడకు తెస్తున్న కొందరు వ్యాపారులు వేరే బ్రాండ్‌ల పేరుతో ప్యాక్ చేసి అమ్ముతున్నారు. మంచి కంపెనీ విత్తనాల ధర కేజీ రూ.లక్ష పైగానే ఉంటుంది. ఫెయిల్ అయిన విత్తనాలను తీసుకువ చ్చి చక్కగా ప్యాక్ చేసి కేజీ కేవలం రూ.40 వేల నుంచి రూ. 60 వేలకు విక్రయిస్తారు. షాప్‌లో దొరికే విత్తనాల ధరకు, బయట విత్తనాల ధరకు బాగా వ్యత్యాసం ఉండటంతో కొందరు రైతులు ఆ వైపుగా మొగ్గు చూపుతున్నారు. అవి సరిగా మొలవక, మొలిచినా కాపు, దిగుబడి రాక అల్లాడిపోతుంటారు. పత్తి విత్తనాలు కూడా గుజరాత్ ప్రాంతం నుంచి లూజ్‌లోనే ఎక్కువగా తెచ్చి అమ్ముతున్నారు. తెలంగాణలో సీజన్ ముందే ఆరంభం అవుతుంది.. కాబట్టి మొదట అక్కడి మార్కెట్‌పై దృష్టి సా రిస్తారు. ఆ తర్వాత ఆంధ్రలో విక్రయాలు జరుపుతున్నారు.



భద్రాద్రి కొత్త గూడెం లో దొరికిన నకిలీ మిర్చి విత్తనాల ప్యాకెట్ లు

ప్రముఖ కంపెనీల్లో పనిచేసి..

ప్రస్తుతం గుంటూరు కేంద్రంగా నకిలీ విత్తనాల వ్యాపారం చేస్తున్న వారంతా ఒకప్పుడు ప్రముఖ కంపెనీ లలో పనిచేసిన వారే. అక్కడ ఉన్న అనుభవంతో సొంతగా వ్యాపారం ఆరంభించి కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఈ రకమైన వ్యాపారం చేసే వారికి వ్యవసాయశాఖ, ఇతర నిఘా విభాగంలో పనిచేసే అధికారులతో మంచి సంబంధాలు ఉంటాయి. ఉదాహరణకు గుంటూరు వ్యవసాయ శాఖలో కీలకంగా పనిచేస్తున్న ఒక ఏఓ స్నేహితుడు ఇటువంటి వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి మేనల్లుడు ప్రస్తుతం తెలంగాణ విత్తనాల వ్యవహారంలో దొరికినట్లు చెబుతున్నారు. ఇలా నకిలీ, అనుమతి లేని విత్తనాల వ్యాపారం చేసే వాళ్లకు.. ఎక్కడో చోట అభయ హస్తం దొరుకుతోంది.

ఇంకా నిద్రావస్థలోనే...

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభం అయినా వ్యవసాయ, విజిలెన్స్ శాఖలు నిద్ర మేల్కొన్న దాఖలాలు కనిపించడం లేదు. నకిలీ విత్తనాలు ఇప్పటికే విస్తారంగా గ్రామాలకు వెళ్లినా ఎక్కడా కూడా నామ మాత్రపు తనిఖీలు లేవు. ఏడాదిలో అసలు తనిఖీలు జరిగిన సందర్భాలు లేవని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నగరంలోని 34 పార్సిల్ కేంద్రాలు ఉన్నా.. వాటిలో కూడా పెద్దగా సోదాలు జరగడం లేదు. నగర పరిధిలోని వ్యవసాయ నిఘా విభాగం పూర్తి గా నిద్రావస్థలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రిమోట్ లొకేషన్‌తో..

గుంటూరు రైల్వే డివిజన్‌కు నష్టం

- రిజర్వేషన్‌లో కోల్పోనున్న కొన్ని రైళ్ల బెర్తులు
- ఈక్యూ బెర్తుల కోసం ప్రత్యేక చార్ట్ అనవసరం

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జనరల్ కోటా నుంచి గుంటూరు రైల్వే డివిజన్‌ని రిమోట్ లొకేషన్‌కు మారుస్తున్నందున రిజర్వుడ్ టిక్కెట్ల పరంగా ఆదాయాన్ని కోల్పోనుంది. ఇదే సమయంలో ఇక్కడి ప్రయాణికులకు ఆయా రైళ్లలో బుకింగ్ చేసుకోవడానికి బెర్తుల సంఖ్య తగ్గిపోతుంది. ఈ నష్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఎమర్జెన్సీ కోటా బెర్తులను విడుదల చేసేందుకు అదనపు సమయం వస్తుందన్న ఆలోచనతో రిమోట్ లొకేషన్ చార్టింగ్‌కు ఇక్కడి కమర్షియల్ విభాగం అధికారులు ఆమోదించడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైల్వే శాఖ తీసుకొన్న ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని కోరుతున్నారు.

మీటర్ గేజ్‌గా ఉన్న సమయంలో అమరావతి ఎక్స్‌ప్రెస్ గుంటూరు నుంచి హుబ్లీకి రాకపోకలు సాగించేది. బ్రాడ్‌గేజ్‌గా మారిన తర్వాత ఈ రైలుని విజయవాడ వరకు పొడిగించారు. గత ఏడాది ఈ రైలుని ఏకంగా నరసపూర్ వరకు తీసుకెళ్లారు. దీంతో అమరావతి ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం నరసపూర్ - హుబ్లీ మధ్యన రాకపోకలు సాగిస్తోంది. కాగా ఇప్పటి వరకు నరసపూర్ నుంచి డోన్ వరకు జనరల్ కోటా ఈ రైలుకు ఉండేది. దీని వల్ల స్లీపర్, ఏసీ త్రీటైర్, టూటైర్ బెర్తులు పుష్కలంగా అందుబాటులో ఉండేవి. అయితే ఎమర్జెన్సీ కోటా బెర్తులను విజయవాడ డివిజన్‌తో కలిసి గుంటూరు డివిజన్ పంచుకోవాల్సి వచ్చేది. ఈ కారణంగా ఇక్కడికి వచ్చిన ఈక్యూ విజ్ఞప్తులను విజయవాడ డివిజన్‌కు పంపితే అక్కడి అధికారులు కన్‌ఫర్మ్ చేసేవారు. అయితే గుంటూరుని రిమోట్ లొకేషన్‌లో పెట్టాలని డివిజనల్ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కారణంగా గుంటూరు నుంచి డోన్ వరకు అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ క్లాస్ బెర్తులు కేవలం 12, ఏసీ త్రీ టైర్ బెర్తులు నాలుగు మాత్రమే ప్రయాణికులు బుకింగ్ చేసుకోవడానికి అనుమతి ఉంటుంది. ఏసీ టూటైర్‌లో ఒక్క బెర్తు కూడా బుకింగ్‌కు కేటాయించలేదు. మరోవైపు విజయవాడ నుంచి పుష్కలంగా బెర్తులు అందుబాటులో ఉంటాయి. దీంతో ఇక్కడి ప్రయాణికులు కూడా విజయవాడ నుంచి బుకింగ్ చేసుకొని బోర్డింగ్ చేంజ్ పెట్టుకొంటున్నారు. ఈ కారణంగా అయా టిక్కెట్ల ఆదాయం అంతా విజయవాడకు వెళ్లిపోతుంది.

ఇదే విధంగా వారంలో మూడు రోజుల పాటు గుంటూరు మీదగా రాకపోకలు సాగించే మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ కొండవీడు ఎక్స్‌ప్రెస్‌కి కూడా బెర్తుల సంఖ్య తగ్గింది. ఈ రైలుకు స్లీపర్ 52, ఏసీ త్రీటైర్ 37, ఏసీ టూటైర్ 9, ఫస్టు ఏసీ రెండు మాత్రమే కేటాయించారు. ఇదే రైలుకు విజయవాడ డివిజన్‌కు స్లీపర్ క్లాస్ 138, ఏసీ త్రీటైర్ 233, ఏసీ టూటైర్ 41, ఫస్టు ఏసీ 14 బెర్తుల కోటా కలిగి ఉంది. వాస్తవంగా ఈ రైలు ఎక్కువ దూరం ప్రయాణం చేసేది గుంటూరు రైల్వే డివిజన్‌లోనే. అయినప్పటికీ విజయవాడ కంటే తక్కువ బెర్తులు కేటాయించడం వల్ల ఇక్కడ వెయిటింగ్ లిస్టు ప్రారంభం కాగానే ప్రయాణికులు విజయవాడ నుంచి బుకింగ్ చేసుకొంటుండటంతో ఆ ఆదాయాన్ని గుంటూరు కోల్పోవాల్సి వస్తోంది.

ఐకానిక్ టవర్ల నిర్మాణానికి..

పర్యావరణ అనుమతులకు సీఆర్డీఏ లేఖ

- ఎస్ఈఐఏఏకు నివేదిక పంపిన సీఆర్డీఏ
- 2018లో జారీ చేసిన టీఓఆర్‌తో సమగ్ర నివేదిక
- వైసీపీ కుట్రల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు

గుంటూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన ఐకానిక్ సెక్రటేరియట్ భవన సముదాయానికి పర్యావరణ అనుమతులు కోరుతూ ఏపీ సీఆర్డీఏ లేఖ రాసింది. స్టేట్ లెవెల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ అథారిటీ (ఎస్ఈఐఏఏ)కి సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఈ మేరకు వివరాలు సమర్పించారు. ఐకానిక్ భవన సముదాయంలో నిర్మిస్తున్న పరిపాలనా భవనాలు, సీఎంఓ వివరాలన్నీ సంబంధిత అధికారులకు పంపారు. 2018లో జారీ చేసిన టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్(టీఓఆర్)ను జత చేసి సమగ్ర నివేదికను అధికారులకు అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో డయా గ్రిడ్ విధానంలో మొత్తం 5 టవర్లు నిర్మిస్తున్నారు. వీటిలో నాలుగు పరిపాలన భవనాలు కాగా, ఒకటి ముఖ్యమంత్రి కార్యాలయంగా ఉంటుంది. రాజధాని పునర్నిర్మాణ ప్రక్రియ మొదలైన నాటి నుంచి వైసీపీ నేతలు కొందరు అడ్డుకోవడానికి అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తూ ఉన్నారు. రాజధాని నిర్మాణానికి రుణ సహాయం అందజేయడానికి ముందుకు వచ్చిన ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులకు లేఖలు రాయడం, రాజధాని ప్రాంతంలో పర్యటనకు వచ్చిన ప్రపంచ బ్యాంకు పరిశీలన బృందాన్ని తప్పుదోవ పట్టించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. అవేవీ ఫలించకపోవడంతో పర్యావరణ సమస్యలను లేవనెత్తి అడ్డుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్డీఏ అప్ర మత్తమైంది. పర్యావరణ సమస్యలు ఇప్పుడు, భవిష్యత్తులో లేవనెత్తే అవకాశం లేకుండా సీఆర్డీఏ పటిష్ఠ చర్యలు తీసుకోవడంలో భాగంగా ఈ లేఖ రాసింది.

రాజధాని జీవవైవిధ్యంపై క్షేత్రస్థాయి మూల్యాంకన

- రెండోరోజు వర్క్‌షాపులో పాల్గొన్న వివిధ విభాగాల ప్రముఖులు
- పలు అంశాలపై చర్చలు



అమరావతిలో పర్యటన అనంతరం ప్రముఖుల గ్రూప్ ఫొటో



విజయవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో 'జీవ వైవిధ్యం, పర్యావరణ అభివృద్ధి' అంశంపై నిపుణుల నేతృత్వంలో జరిగిన రెండోరోజు వర్క్‌షాపు ముగిసింది. శుక్రవారం ఢిల్లీకి చెందిన నిపుణుల బృందం అనంతవరం హిల్స్, శాకమూరు పార్క్, ఏజీసీ ప్రాంతం, హైకోర్టు, సీడ్ యాక్సెస్ రోడ్, ఏడీసీఎల్, వాటర్‌బాడీ, వెంకటపాలెం నర్సరీ వంటి కీలకమైన పర్యావరణ ప్రాంతాలను సందర్శించింది. ఈ ప్రదేశాలు అమరావతి గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్‌లో అంతర్భాగాలుగా ఉన్నాయి. అనంతరం ఏడీసీఎల్ హార్టికల్చర్ బృందంతో కలిసి వివిధ జాతుల చెట్లు పెరగడానికి అనుకూలమైన స్థలం, డిజైన్ మెరుగుపరిచే విధానంపై కార్యాచరణ రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు లోబడి అమరావతిని ప్రకృతిలో ఎలా అనుసంధానం చేయాలో ఈ బృందాలు వివరించాయి. అనంతరం ఏపీ సీఆర్‌డీఏ భవనంలో జరిగిన సమావేశంలో ఢిల్లీకి చెందిన నీలా హౌస్ కన్‌స్ట్రక్టెడ్ వెట్ ల్యాండ్ సంస్థ సభ్యులు మొక్కలు, జలసంబంధమైన ప్రణాళికల గురించి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో పర్యావరణాన్ని పునరుద్ధరించే మొక్కల జాతులు గురించి ప్రదర్శించారు. అనంతరం అమరావతి గ్రీన్‌ఎనర్జీ మౌలిక సదుపాయాలు, పార్కులు, అవెన్యూలు, బఫర్ ప్లాంటేషన్, నగర వ్యాప్తంగా నీలి, ఆకుపచ్చ పర్యావరణ నెట్‌వర్క్ అభివృద్ధి గురించి ప్రెజెంటేషన్ చేశారు. ముగింపు సెషన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తమ సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఢిల్లీ విశ్వవిద్యాలయ వర్గీకరణ శాస్త్రవేత్త, మాజీ వైస్ చాన్సలర్ సీఆర్ బాబు, శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ రవిప్రసాద్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి ఎన్.చంద్రమోహన్ రెడ్డి, ఏడీసీఎల్ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ కలెక్టర్ డైరెక్టర్ ధర్మజ, సీనియర్ ప్లానర్ ప్రమాన్‌కుమార్, ఏపీసీఆర్‌డీఏ స్ట్రాటజీ డివిజన్ డైరెక్టర్ ఎన్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల భవిష్యత్తు ఇక సెట్

- ప్రభుత్వ జూ.కళాశాలల్లో ఈఏపీ సెట్, నీట్ శిక్షణ
- కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు
- సమయ ప్రణాళికపై ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు

సత్తెనపల్లి జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదని కూటమి ప్రభుత్వం కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఈఏపీ సెట్, నీట్‌లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులను సన్నద్ధం చేయాలని మార్గదర్శకాలను రూపొందించింది. ఇందుకు అవసరం అయిన పుస్తకాలను ప్రభుత్వ కళాశాలలకు అందజేసింది. పల్నాడు జిల్లాలోని ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,700 మంది ఉన్నారు. మొదటి సంవత్సరంలో 2,500 మంది అడ్మిషన్లు పొందనున్నారని సమాచారం. పల్నాడు జిల్లాలో ప్రభుత్వ జూనియర్, ఆదర్శ కళాశాలలు, కెజీబీవీలు, రెసిడెన్సియల్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్‌లు 62 ఉన్నాయి. ఇప్పటి వరకూ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు 5 నుండి 10 శాతం మంది మాత్రమే ఇంజనీరింగు, వైద్య సీట్లు పొందుతున్నారు. ఉన్నత విద్య చదవాలని పేద విద్యార్థులకు ఉన్నప్పటికీ సరైన శిక్షణ లేకపోవడంతో వెనుకబడి పోతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు ప్రధాన సబ్జెక్టులుగా బోధిస్తున్నారు. ఇంజనీరింగు, మెడిసిన్ శిక్షణ తీసుకోవాలంటే ప్రవేటుగా రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గనుంది. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ పాఠ్యాంశాలతో పాటు ఈఏపీ సెట్, నీట్ తదితర పోటీ పరీక్షలు రాసేందుకు శిక్షణ ఇవ్వాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సదరు మెటీరియల్ సిద్ధం చేసి ఆయా కళాశాలలకు ఇప్పటికే పంపడం జరిగింది. పాఠ్యాంశాల బోధనతోపాటు వీటికి సంబంధించిన సమయ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించినట్లు డీఐఈఓ కె.సుచరిత తెలిపారు.

అడవిని తలపిస్తున్న ఐటీఐ ప్రాంగణం

- చెరువులా పల్లపు ప్రాంతం
- మురుగుతో దుర్గంధం



ఐటీఐ స్థలంలో పెరిగిపోతున్న ముళ్ల చెట్లు



జాతీయ చిహ్నం చుట్టూ అపరిశుభ్ర వాతావరణం

తెనాలి అర్బన్, జూన్13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్గడిగుంటపాలెంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ స్థలంలో ముళ్ల చెట్లు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. పల్లపు ప్రాంతంలో నీరు చేరి చెరువులా మారింది. జాతీయ చిహ్నం చుట్టూ అపరిశుభ్రత పెరిగిపోయింది. 20 ఎకరాల్లోని ఐటీఐలో.. ఐదు ఎకరాల భూమిని కేంద్రీయ విద్యాలయం కోసం ఇచ్చారు. మిగిలిన 15 ఎకరాల్లో కొంత మేర కళాశాల భవనాలు ఉండగా.. మిగిలిన ప్రాంతమంతా పిచ్చి చెట్లు, ముళ్ల పొదలతో నిండిపోయింది. దీంతో విషసర్పాల బెడద ఎక్కువైపోయింది. జగ్గడిగుంటపాలెం రోడ్డు వైపు ఉన్న స్థలం పల్లం కావడంతో వర్షపు నీరు చేరుతోంది. దీనికి తోడు పంచాయతీ కాల్వలు సరిగా నిర్వహించకపోవడంతో మురుగు నీరు ఇక్కడ చేరుతోంది. దీంతో దుర్గంధం, దోమల బెడద అధికమైందని స్థానికులు వాపోతున్నారు. ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ చిహ్నం చుట్టూ చెత్తా చెదారం పేరుకుపోయింది. ఐటీఐలో అటెండర్లు, వాచ్‌మెన్‌లు లేకపోవడంతో విద్యార్థులతోనే కొంత మేరకు శ్రమదానం చేయించి శిక్షణ కేంద్రం నిర్వహణ ప్రాంతం వరకు శుభ్రంగా ఉంచుతున్నారు. దాతలు, ప్రభుత్వం స్పందించి ఐటీఐ ప్రాంగణాన్ని శుభ్రం చేసి, మొక్కలు నాటి నిర్వహణకు తగిన సిబ్బందిని కేటాయించాలని పలువురు సూచిస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్‌కు తీవ్రగాయాలు


ప్రమాదస్థలంలో దెబ్బతిన్న స్కూటీ

ఒంగోలు(రూరల్), జూన్ 13(ఆంధ్ర జ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులో లారీ ఢీకొనడంతో ట్రాన్స్‌జెండర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. శుక్రవారం బియ్యంలారీ స్థానిక ఎఫ్‌సీఐ గూడెంలోకి వెళ్లే సమయంలో ట్రాన్స్‌జెంటర్ స్కూటీపై వెళుతూ వేగంగా వెనుక వైపు ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కాగా స్థానికులు వైద్యశాలకు తరలించారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

30లోపు బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలి. కంటిచూపులేని ఉద్యోగులు, మానసిక వైకల్యంతో ఉన్న పిల్లల తల్లి దండ్రులు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన ఉద్యోగులు, 40 శాతం పైగా వైకల్యం ఉన్న ఉద్యోగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న ఉద్యోగులు, భర్తలేనటువంటి మహిళా ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలి. దంపతులిద్దరూ ఉద్యోగులైతే సమీప ప్రాంతాల్లోనే నియమించాలి. ఈ బదిలీలు స్వచ్ఛంద బదిలీలుగా పరిగణించి ప్రయాణభత్యం, ఇతర ప్రయోజనాలు కల్పించాలి. ముందుగా ఐటీడీఏ ప్రాంతాల్లో ఖాళీలను పూర్తిచేసిన తర్వాతనే మిగిలిన సచివాలయాల్లో భర్తీ చేయాలి. సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయిన తర్వాత సచివాలయాల రేషనలైజేషన్‌లో మిగిలిపోయిన ఉద్యోగుల వివరాలను హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టర్‌లో జూలై 10లోపు నమోదు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

బ్యాంకు ఖాతాతో ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ఒంగోలు నగరం, జూన్ 13(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం తల్లికి వందనం నిధులు విడుదల చేస్తోందని, ఇవి బ్యాంకు ఖాతాకు జమ కావాలంటే ఆధార్ నంబరుతో ఖాతాను అనుసంధానం చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ కోరారు. 9, 10 తరగతులు చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు తల్లికి వందనం నిధులు తల్లుల ఖాతాలకు జమ అవుతాయని, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు వారి ఖాతాలకు నిధులు జమ చేస్తారని తెలిపారు. ఆధార్ నంబర్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసి, ఆ ఖాతా వివరాలను సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ ద్వారా ఎన్‌పీసీఐ పోర్టల్‌లో అనుసంధానం చేసుకోవాలని కోరారు. ఈ నెల 16వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు.

గుండెపోటుతో హెల్త్ సూపర్‌వైజర్ మృతి


పిచ్చయ్య(ఫైల్)

వేటపాలెం (చీరాల), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధి లోని పందిళ్లపల్లి పీహెచ్‌సీ లో హెల్త్ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న పిచ్చయ్య(60) గుండెపోటుతో మృతి చెందారు. ఎప్పటిలాగే శుక్రవారం కూడా విధులకు హాజరయి పనిచేస్తున్న సమయంలో విధుల్లోనే ఉన్నపాటుగా గుండెపట్టుకుని కుప్పకూలాడు. ఈ క్రమంలో పరీక్షలు వేటపాలెం మెడికల్ అధికారి డా.స్వాతికిరణ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన మృతిపై పలువురు ఆరోగ్య సిబ్బంది దిగ్భ్రాంతి చెందారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

నాగులుప్పలపాడు, జూన్13 (ఆంధ్రజ్యోతి): ఖననం చేసిన మహిళ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన కనపర్తిలో జరిగింది. వీఆర్వో భాగ్యారావు తెలిపిన వివరాల మేరకు.. ఇరవై రోజుల క్రితం కనపర్తి గ్రా మంలోని రెడ్డిపాలెంకు చెందిన కుక్కల కోటేశ్వరమ్మ (70) ప్రయాణిస్తున్న ఆటో దాసరివారిపాలెం వద్ద బోల్తాపడింది. దీంతో ఆమె గాయపడగా ఒంగో లులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అనంతరం జీజీహెచ్‌కు తరలించగా కోటేశ్వరమ్మ మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధా రించారు. దీంతో ఆమె మృతదేహాన్ని కనపర్తి తరలించి వ్యవసాయ భూముల్లో ఖననం చేశారు. మృతురాలి కుటుంబసభ్యులు వినతి మేరకు శుక్రవారం జీ జీహెచ్ వైద్యులు తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ రజియాసుల్తానా స మక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు.

అర్ధరాత్రి పులి పంజా

పాలుట్ల గూడెంలో పశువుల దొడ్డిపై దాడి
ఒక ఎద్దు, ఆవు మృతి
కన్నీటిపర్యంతమైన రైతు సేవ్యానాయక్
ఆందోళన చెందుతున్న గిరిజన కుటుంబాలు


పాలుట్లలో పులిదాడిలో గాయపడి మృతి చెందిన అరక ఎద్దు

ఎర్రగొండపాలెం, జూన్ 13(ఆంధ్ర జ్యోతి): ఎర్రగొండపాలెం మండలం పాలుట్ల గిరిజనగూడెంలో గురువారం రాత్రి ఆవులదొడ్డిపై పులి దాడి చేసింది. కరంతోటి సేవ్యానాయక్‌కు చెందిన ఒక ఎద్దు, ఆవును చంపేసింది. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. గ్రామ సచివాలయం పక్కనే ఆవులదొడ్డి ఉండటంతో వాటి యజమాని ఆవులను, అరక ఎద్దులను దొడ్డిలో తోలి ఇంటికి వెళ్లాడు. రాత్రి సమయంలో దొడ్డిలోకి పులి ప్రవేశించడంతో ఆవులు అటుఇటూ బెదురుతూ పరుగెత్తండటాన్ని చూసిన స్థానికులు పెద్దగా కేకలు వేయడంతో గూడెం గిరిజనులు అక్కడకు చేరుకున్నారు. వారంతా కేకలు వేయడంతో పులి అక్కడ నుంచి వెళ్లిపోయింది. అప్పటికే పులి దాడిలో గాయపడిన అరక ఎద్దు, ఆవు మృతి చెందాయి. వాటిని చూసి యజమాని సేవ్యానాయక్ కన్నీరుమున్నీరయ్యారు. అరక ఎద్దు విలువ రూ.70 వేలు, ఆవు విలువ రూ.40 వేలు ఉంటుందని, మొత్తం రూ.1.10 లక్షలు నష్టం వాటిల్లిందని విలపిస్తూ తెలిపారు. ఈ ఘటనతో పాలుట్ల గిరిజనులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలుట్లలో ఆవుల దొడ్లు 20కిపైగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పులుల దాడి నుంచి తమను, పశుసంపదను కాపాడాలని ఫారెస్టు అధికారులకు గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం మరింత రుచిగా...

అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యం
విద్యాలయాలకే నేరుగా సరఫరా
క్యూఆర్ కోడ్‌ను హెచ్‌ఎం స్కాన్ చేస్తేనే ఆ స్కూలు వాటా దిగుమతి


మధ్యాహ్నభోజనం చేస్తున్న విద్యార్థులు

సంతనూతలపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడంతో పాటు వారికి బలవర్థక ఆహారం అందించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. మధ్యాహ్న భోజన పథకం అమలులో గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న లోటుపాట్లు సరిచేసేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన సన్నబియ్యాన్ని సరఫరా చేయాలని నిర్ణయించారు. గతంలో సరఫరా చేసిన బియ్యంలో నాణ్యత సరిగా లేకపోవడంతో అన్నం ముద్దగా ఉండేది. దీంతో చాలామంది పిల్లలు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునేవారు. ఈ ఏడాది వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం నుంచి అన్ని రకాల ప్రభుత్వ బడుల్లో సన్న బియ్యంతో వండిన అన్నాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్నారు.

మండలంలో 46 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనానికి సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. గతంలో పౌరసరఫరాల శాఖ ద్వారా డీలర్‌కు అక్కడ నుంచి పాఠశాలలకు బియ్యం తరలించేవారు. ప్రస్తుతం నేరుగా పాఠశాలలకు, హాస్టళ్లకు ఇస్తున్నారు. 25 కేజీల బ్యాగ్‌గా తయారు చేసి క్యూర్‌కోడ్ ట్యాగ్‌తో సరఫరా చేస్తున్నారు. ఈ కోడ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్కాన్ చేస్తే ఓటీపీ ఆధారంగా ఆ పాఠశాల కోటాను సిబ్బంది దింపి వెళతారు.

వంటసిబ్బందికి శిక్షణ పూర్తి

మధ్యాహ్న భోజనం వండి పెట్టే నిర్వాహకులకు, వంట చేసే వారికి మండలాల వారీగా గత వారం కిందటే శిక్షణ ఇచ్చారు. విజయవాడలో శిక్షణ పొందిన వారు మండల స్థాయిలో వంటచేసేవారికి శిక్షణ ఇచ్చారు. వంటచేసే విషయంలో శుభ్రమైన పద్ధతుల్లో ఏ విధంగా వంట చేయాలో, పోషక విలువలు పాడవకుండా ఏ విధంగా చేయాలో వంట చేసే చోటు పరిశుభ్రత తదితర అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు.

సముద్రతీరంలో ఆహ్లాదంగా యోగాంధ్ర



పర్చూరులో యోగాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, చీరాలలో యోగా చేస్తున్న అధికారులు

చీరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రామాపురం సముద్రతీరం అధికారులు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంతో ఆహ్లాదకరంగా మారింది. సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం శుక్రవారం రామాపురం తీరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చీరాల పరిధిలోని అన్ని ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్, ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్లు, గోపీకృష్ణ, పార్వతి, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం

పర్చూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమౌతుందని పర్చూరు మండల హోమియో వైద్యులు, యోగాంధ్ర మాస్టర్ ట్రైనర్ డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పర్చూరు బొమ్మల కూడలిలో యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు ఆసనాలు వేసి ప్రజను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పనిఒత్తిడితో ప్రజలు మానసిక రుగ్మతలకు లోనవుతున్నారన్నారు. తద్వారా వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. దీన్ని అధిగమించేందుకు ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో యార్లగడ్డ శ్రీనివాసరావు, బి.సాంబశివరావు, వై.పోలిరెడ్డి, షేక్.బాజీబాషా.తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో జనం బెంబేలు

● పోలీసుల ఉదాశీనత ● జోరుగా మోటార్లు, బైక్‌ల దొంగతనాలు ● చోరీ కోసం వచ్చిన ఆటోను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన ఆక్వా రైతులు



దొంగతనానికి వినియోగించిన ఆటో, తరలించేందుకు సిద్ధంగా ఉన్న మోటార్లు

కొత్తపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొత్తప ట్నం మండలంలో గత నెల రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు బెం బేలెత్తుతున్నారు. రొయ్యల చెరువుల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లు, నివాసాల వద్ద తాళాలు వేసి ఉన్న మోటార్‌సైకిళ్లను రాత్రి వేళల్లో అపహరిం చుకెళుతున్నారు. ఈ దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నా వారు స్పందించకపోవ టంతో దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టపగలే చో రీలకు తెగబడుతున్నారు. శుక్రవారం కొప్పోలు- అల్లూరు గ్రామాల మధ్య చింతల సమీపంలో అల్లూరు ఎంపీటీసీ శాంతారావు సాగు చేస్తున్న రొయ్యల చెరువుల వద్ద విద్యుత్ మోటార్‌ను పట్టపగలే అపహరించేందుకు ముగ్గురు దొంగలు యత్నించారు. దీంతో వారిని రైతులు పట్టుకునేం దుకు ప్రయత్నించగా పారిపోయారు. ఈక్రమం లో మోటార్‌ను తరలించేందుకు దొంగలు ఉ పయోగించిన ఆటోను రైతులు స్వాధీనం చేసు కుని ఒంగోలు సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌కు అ ప్పగించారు. వారం క్రితం అల్లూరు గ్రామంలోనే ఇంటి ముందు నిలిపిఉంచి మోటార్‌సైకిల్‌ను రాత్రికి రాత్రే తీసుకుపోయారు. విచిత్రమేమంటే తమ వద్ద డొక్కు మోటార్‌సైకిల్‌ను అక్కడే వది లేసి ఇంటి ముందు ఉన్న కొత్త బైక్‌ను చోరీ చేశారు. పది రోజుల క్రితం చింతల సమీపంలోని రొయ్యల చెరువుల వద్ద రాత్రి సమయంలో వి ద్యుత్ మోటార్లను చోరీ చేసిన వ్యక్తులు తమ వద్ద ఉన్నపాత మోటార్‌సైకిల్‌ను అక్కడే వదిలేసి వెళ్ళిపోయారు. ఇలా ఈ వారం పది రోజుల్లో దా దాపు 10 విద్యుత్ మోటార్లు, ఆక్వా సాగులో ఉప యోగించే ఇతర పరికరాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు ఉన్నతాధికారులు స్పందించి దొంగల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తల్లికి వందనం.. ఆనందం

(5వ పేజీ తరువాయి)

బ్యాంకుల నుంచి ఎస్ఎంఎస్‌ల ద్వారా నగదు జమైనట్లు సందేశాలు రావడంతో చాలామంది సాయంత్రానికే ఏటీఎంలకు క్యూ కట్టారు. 14న రెండో శనివారం, 15న ఆదివారం వరుస సెలవుదినాలు కావడంతో శుక్రవారమే నగదు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. పాఠశాలలు, కళాశాలలు తెరవడంతో పిల్లలకు అవసరమైన ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు వంటివి కొనుగోలు చేసుకోవడానికి తల్లికి వందనం నగదు ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి సచివాలయాల వారీగా సోషల్ ఆడిట్ జరుగుతుందని అభ్యంతరాల స్వీకరణకు జూలై 5 వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి పథకం లబ్ధి అందేలా చూస్తామని అధికారులు తెలిపారు. తల్లికి వందనం పథకానికి అర్హులైన వారి జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు. ఇప్పటికే నగదు జమైన తల్లులు ఇంకా ఏవైనా అభ్యంతరాలుంటే సచివాలయాలలో తెలపాలని ప్రభుత్వం సూచించింది. అర్హత ఉండి పథకం అందని వారు వివరాలను సచివాలయాల్లో ఇస్తే త్వరలోనే డబ్బులు జమ అవుతాయని అధికారులు తెలిపారు. బ్యాంకు ఖాతాల విషయంలో తలెత్తిన సాంకేతిక చిక్కులను తొలగించుకోవడానికి పిల్లల తల్లులు దృష్టిపెట్టాలని అధికారులు కోరుతున్నారు. కొంతమంది తల్లుల ఖాతాల్లో నగదు జమ అయినా వారి బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడంతో రిఫండ్ వెళ్లిపోయాయని అధికారులు చెబుతున్నారు.

నాడు ఒకరికి.. నేడు అందరికీ

వైసీపీ హయాంలో ఎంతమంది పిల్లలున్నా ఒక్కరికే రూ.13 వేల నగదు జమ అయ్యేది. అయితే దీని వల్ల మిగిలిన పిల్లల చదువుల కోసం పేదలు ఇబ్బందులు పడుతుండటాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు గుర్తించారు. సూపర్‌సిక్స్ పేరుతో తీసుకువచ్చిన ఎన్నికల మ్యానిఫెస్టోలో తల్లికి వందనం పథకాన్ని చంద్రబాబు చేర్చారు. పైగా కుటుంబంలో ఒకరికి కాదు.. ఎందరు పిల్లలు ఉన్నా వారి చదువులకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు సహా కూటమి నేతలు ప్రకటించారు. తనకున్న బిడ్డలందరి చదువుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నగదు జమ అనడంతో గంపగుత్తగా మహిళలు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీలతో గెలిపించారు. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగానే కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ నగదు జమ చేయడంతో పేద కుటుంబాల్లో సంతోషాలు రెట్టింపయ్యాయి.

బంగారు గొలుసు చోరీ కేసులో నిందితుడి అరెస్టు : సొత్తు స్వాధీనం

అవీఇవీ


స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసు, చోరీ చేసిన ముద్దాయితో ఎస్ఐ వినోద్‌బాబు

పంగులూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దేవుడి ప్రసాదంలో మత్తు మందు కలిపి నమ్మకంగా తినిపించి స్పృహ కోల్పోయిన మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసు చోరీ చేసిన అంతర్ జిల్లా దొంగను రేణంగివరం పోలీసులు అదుపులోకి తీసుకుని సొత్తు రికవరీ చేశారు. ఎస్ఐ వినోద్‌బాబు అందించిన సమాచారం మేరకు... గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం బొగ్గిల్లువడ్డేశ్వరం గ్రామానికి చెందిన పబ్బరాజు వెంకటయుగంధర్ గత నెలలో బూదవాడ గ్రామంలో వజ్రాల కృష్ణారెడ్డి వద్దకు వచ్చి పరిచయం చేసుకుని ఇల్లు అద్దెకు కావాలని అడిగాడు. వెంకటయుగంధర్ మాటలు నమ్మిన కృష్ణారెడ్డి తన ఇంటి సమీపంలో ఖాళీగా ఉన్న వజ్రాల హనుమారెడ్డి ఇంటిని అద్దెకు ఇప్పించాడు. గత నెల 18వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో యుగంధర్ ముందుగా మత్తు మందు కలిపిన పదార్థాన్ని అన్నవరం ప్రసాదం పేరుతో కృష్ణారెడ్డి దంపతులకు అందజేశాడు. అదితిన్న దంపతులిద్దరూ స్పృహ కోల్పోయి నిద్రకు ఉపక్రమించారు. అనంతరం కృష్ణారెడ్డి భార్య మెడలో గొలుసును అపహరించాడు. గొలుసు చోరీ జరిగిన విషయాన్ని ఈ నెల 12న రేణంగివరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పలు చోరీల కేసులలో పట్టుబడిన చరిత్ర ఉన్న యుగంధర్ ఫొటోను చూపించగా ఇంటిలో అద్దెకు దిగిన వ్యక్తిని అతనేని కృష్ణారెడ్డి గుర్తించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో వెంకటయుగంధర్ ఉన్న ప్రాంతానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు వినోద్‌బాబు తెలిపారు. నిందితుడిని శుక్రవారం అద్దంకి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

బాబు, పవన్‌లను దూషించిన వ్యక్తిపై కేసు


ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

ఒంగోలు క్రైం, జూన్13(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మీద అసభ్య పదజాలంతో మాట్లాడిన వ్యక్తిపై ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. అల్లూరికి చెందిన మంచికంటి గరిటారెడ్డి అసభ్యపద జాలంతో మాట్లాడటంతో జనసేన పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, కార్యదర్శి ముత్యాల కళ్యాణ, కృష్ణ, పెన్నా ప్రాంతీయ కమిటీసభ్యురాలు బొందిల శ్రీదేవి, నగరకార్యదర్శి పల్ల ప్రమీల పాల్గొన్నారు.

సంతమాగులూరు మద్యం షాపు లైసెన్స్ రద్దు

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు

బాపట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సంతమాగులూరు మండలంలోని జీఎస్.ఎల్ నెంబరు బీపీఎల్ /98 షాపు లైసెన్స్ రద్దు చేసినట్లు జిల్లాప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. లైసెన్స్‌దారులు ప్రభుత్వానికి ఫీజు చెల్లించకపోవటంతో రద్దు చేసినట్లు చెప్పారు. దీనికి సంబంధించి నూతన లైసెన్స్ ఇవ్వటానికి దరఖాస్తులు స్వీకరణకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దరఖాస్తు చేయదల్చిన వారు జిల్లాలోని అద్దంకి, బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం, చీరాల, పర్చూరు ఎక్సైజ్ స్టేషన్‌లలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడుతాయన్నారు. 21వ తేది ఉదయం 8గంటలకు కలెక్టరేట్ ఆవరణంలో డ్రా తీస్తామన్నారు.

'పొదిలి'లో మద్యం షాపునకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు క్రైం, జూన్13(ఆంధ్రజ్యోతి): పొదిలి రూరల్ మండలంలో ఒక మద్యం షాపు ఏర్పాటుకు ఔత్సాహికులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఆయేషాబేగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు తుది గడువు ఈనెల19 సాయంత్రం 5 గంటల వరకు అని, దరఖాస్తుదారులు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పొదిలి జీఎస్ నంబరు 71 షాపునకు దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. ఈనెల 21న ఉదయం 8 గంటలకు కలెక్టర్ సమక్షంలో డ్రా తీస్తామని, దరఖాస్తుదారులు అందరు డ్రాలో పాల్గొనాలని ఆమె కోరారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

చినగంజాం, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : చినగంజాంలోని సోపిరాల రైల్వేగేటు సమీపంలో ఎగువ రైల్వేలైన్‌లో రైలు నుంచి జారిపడి యువకుడు మృతిచెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. చీరాల జీఆర్‌పీ ఎస్ఐ కొండయ్య తెలిపిన వివరాలు ప్రకారం, సోపిరాల రైల్వేగేటు సమీపంలోని ఎగువ రైల్వేలైన్‌లో రైలుబండి నుంచి ప్రమాదవశాత్తు జారిపడడంతో గుర్తు తెలియని యువకుడికి బలమైన గాయాలై మృతి చెందినట్లు తెలిపారు. మృతిని కుడి చేతి షోల్డర్ మీద విజయలక్ష్మి అనే పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. వయస్సు 30 సంవత్సరాలు ఉంటాయన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వాళ్లు 9440627646 నంబరును సంప్రదించాలన్నారు.

గ్రామాలలో సమస్యలపై దృష్టి సారించండి

ఇంకొల్లు, జూన్ 13,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాలలో తాగునీటి సరఫరాపై పంచాయితీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీవో జి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొణికి పంచాయతీలో రికార్డులను ఆయన శుక్రవారం పరిశీలించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలపై దృష్టిసారించి అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రధానంగా తాగునీటి చెరువు పరిశీలన, నీటి సరఫరా పలు అంశాలపై వివరాలు కార్యదర్శి అడ్డగడ్డ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు.

16 నుంచి సెమిస్టర్ పరీక్షలు

సంతనూతలపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు 4వ సెమిస్టర్ పరీ క్షలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుబ్బారావు ఓ ప్రక టనలో తెలిపారు. జిల్లాల్లోని ప్రభుత్వ ప్రైవేట్ డీఎడ్ కళాశాల్లో 2023-25 బ్యాచ్‌కు చెందిన డీఎడ్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, 2022-24లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ డీఎడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఈ విషయం గమనించాలని ఆయన కోరారు.

అవీ..ఇవీ..

వేటపాలెం ఎస్సైగా జనార్దన్ బాధ్యతలు

● వెంకటేశ్వర్లు టూటౌన్‌కు బదిలీ



బాధ్యతలు స్వీకరించిన ఎస్సై జనార్ధన్

వేటపాలెం(చీరాల), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం నూతన ఎస్సైగా పెనుమాల జనార్దన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆయన వీఆర్‌లో ఉన్నారు. జనార్ధన్ గతంలో వెదుళ్లపల్లిలో రెండేళ్లు, ఈపూరుపాలెంలో కూడా దాదాపుగా రెండేళ్లు బాధ్యతలు నిర్వర్తించారు. ఈక్రమంలో స్టేషన్ సిబ్బంది ఎస్సైకు ఘనస్వాగతం పలికారు. అయితే ఇప్పటి వరకు విధుల్లో ఉన్న మీసాల వెంకటేశ్వర్లు టూటౌన్‌కు బదిలీపై వెళ్లారు.

ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కూటమి నేతలు

చీరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాసన సభ్యులు ఎంఎం కొండయ్య ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాదర్బార్‌కు వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఈక్రమంలో శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయన ఆదేశాల మేరకు కూటమి నేతలు నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 153 అర్జీలు అందాయి. అందులో 35 పెన్షన్, 105 నివేశన స్థలాలు, 13 ఇతర సమస్యలకు సంబంధించిన అర్జీలు అందాయి. అర్జీలు శాసనసభ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కతవరపు జనార్ధనరావు, గంజి పురుషోత్తం, పద్మిని, ప్రసన్న తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.

ఏవోగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



శుభాకాంక్షలు తెలియజేస్తున్న సిబ్బంది

బల్లికురవ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల వ్యవసాయాధికారిగా పి. శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఏవో కుమారి యద్దనపూడి మండలానికి బదిలీ కాగా కొరిశపాడులో పనిచేస్తున్న శ్రీనివాసరావును బల్లికురవ మండలానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన ఏవోను మండలంలోని పలు గ్రామాల రైతుసేవా కేంద్రాల సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి వ్యవసాయ సమస్యలపై సలహాలు అందజేస్తామన్నారు.

ఉపఖజానా అధికారిగా సుబ్బారావు

మార్టూరు,జూన్13(ఆంధ్రజ్యోతి): మార్టూరు ఉపఖజానా అధికారిగా ఎంవీ.సుబ్బారావు శుక్రవారం ఎస్‌టీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాపట్ల నుంచి బదిలీపై మార్టూరు వచ్చారు. ఆయనను మర్యాదపూర్వకంగా విశ్రాంత ఉద్యోగులు రావుల బాపయ్య, ఎం పిచ్చయ్య శర్మ, పి శ్రీరామచంద్రమూర్తి, పి.శివరామకోటేశ్వరరావు, చిట్టిబాబు తదితరులు కలిశారు.

కమిషనరేట్‌కు తహసీల్దార్ పార్వతి సరెండర్

వేటపాలెం (చీరాల), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల తహసీల్దార్ పాలపర్తి పార్వతిని కలెక్టర్ వెంకట మురళీ కమిషనరేట్‌కు సరెండర్ చేశారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులు శుక్రవారం జారీ చేశారు. కొంతకాలంగా వేటపాలెంలో విధులు నిర్వహిస్తున్న పార్వతిపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. పార్వతి సుదీర్ఘ కాలంగా చీరాల పరిధిలో పనిచేశారు. ప్రస్తుతం ఈ విషయం హాట్‌టాపిక్‌గా మారింది. చీరాల తహసీల్దార్ గోపీకృష్ణను ప్రస్తుతం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

నూతన వ్యవసాయాధికారిగా మీరమ్మ

ఇంకొల్లు, జూన్ 13,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండల నూతన వ్యవసాయాధికారిగా ఎస్.మీరమ్మ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో యద్దనపూడి మండల ఏవోగా పనిచేస్తూ బదిలీపై ఇంకొల్లు వచ్చారు. గతంలో ఇక్కడ ఏవోగా విధులు నిర్వర్తించిన వేణుగోపాల్ ఒంగోలు ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు.

నూతన సీడీపీవోగా సులోచనారాణి

ఇంకొల్లు, జూన్ 13,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు నూతన సీడీపీవోగా సులోచనరాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఝాన్సీ బదిలీపై వేటపాలెం వెళ్లారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన సులోచనరాణి అంగన్‌వాడీ కేంద్రాలపై నిత్యపర్యవేక్షణతో లోపాలను సరిచేసేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు.

అపరాధ రుసుము విధింపు

అద్దంకి, జూన్13(ఆంధ్రజ్యోతి): మద్యంసేవించి వాహనాలు నడుపుతున్న 9 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ2 వేల చొప్పన రూ.18 వేలను న్యాయాధికారి అఖిల అపరాధ రుసుము విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

దామావారిపాలెం ఫ్లెక్సీ ఏర్పాటు

అద్దంకి, జూన్13(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో దామావారిపాలెం వద్ద నామ్ రోడ్డు వెంబడి ఎన్‌టీఆర్‌నగర్ గా బోర్డు ఏర్పాటు చేయడంతో దామావారిపాలెం వాసులు ఆ గ్రహం వ్యక్తం చేస్తూ ఆ బోర్డు కనిపించకుండా పైన దామావారిపాలెం గా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

జాబ్‌మేళాలో 64 మంది ఉద్యోగాలకు ఎంపిక

మార్టూరు, జూన్13(ఆంధ్రజ్యోతి): మార్టూరులోని వీఎస్‌ఆర్‌అండ్ ఏఎం డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో వివిధ కంపెనీలలో ఉద్యోగాల కోసం 64 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 159 మంది హాజరుకాగా వారిలో 64 మంది ఎంపికయ్యారు. అదేవిధంగా జాబ్ మేళాకు ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్ర, మాస్టర్ మైండ్స్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, యంగ్ ప్రొఫెషనల్ స్టాఫ్ సౌగంధి, సమన్వయకర్త శ్రీకాంత్, రమేష్, వినోద్, గోపి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి అనుమానస్పద మృతి

అద్దంకి, జూన్13(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణానికి సమీపంలో రేణింగవరం రోడ్డులో నల్లవాగు వద్ద వేపచెట్టుకు గుర్తు తెలియని వృద్ధుడు (60) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుమారు 10 రోజుల క్రితం మృతి చెందినట్లు భావిస్తున్నారు. పూర్తి బట్టతల ఉందని, ఖద్దర్ చొక్కా, లుంగి కట్టుకొని ఉన్నాడు. వీఆర్‌వో సురేంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే అద్దంకి పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చినగంజాం, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చినగంజాం, కొత్తపాలెం, పెదగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ పి.గణనారామణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బడిలోనే బంగారు భవిష్యత్తు

● స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

చీరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఆట పాటలతో, చక్కని చదువుతో అందరి మధ్య సంతోషంగా నడవాల్సిన కొందరు చిన్నారుల భవిష్యత్తు నేడు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కార్మికులుగా మారి ఊగిసలాటలో ఉంది. కొంతమందికి ఆర్థిక లేమితో మరి కొందరికి సాకే సంతన లేకపోవడంతో బడిలో ఉండాల్సిన వారు బడిబయటే ఆగిపోతున్నారు. దీంతో ఎంతో చక్కగా సాగాల్సిన భవితవ్యం వివిధ సమస్యల కారణంగా ప్రశ్నార్థకంగా మారుతోంది.

బడి ఈడు పిల్లలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

రేపటి భావిభారత పౌరులుగా నిలవాల్సిన వారు బాల్యంలోనే కార్మికులుగా మారుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల ఉన్నత న్యాయస్థానాలు బాలలకోసం కొత్త చట్టాలు రూపొందించింది. సెక్షన్-3 ప్రకారం 14 సంవత్సరాలలోపు చిన్నారులను కచ్చితంగా పనిలో చేర్చుకోరాదు. అలాగే 18 సంవత్సరమల లోపు వయసు వారిని ప్రమాదకరమైన పనుల్లో అసలు చేర్చరాదు. కొంతవరకు ప్రమాదం లేని పనుల్లో 16 నుండి 18 సంవత్సరాల లోపు వారిని కార్మికులుగా నియమించుకొనే వెసులు బటు ఉంది. అందుకు భిన్నంగా వ్యవహరించిన దుకాణ దారులకు రూ.10 వేలు నుండి రూ.50 వేలు వరకు చలానా విధించే విధంగా చట్టం ఉంది. ఈ విధంగా పొందిన చలానాను జిల్లా అధికారుల ప్రత్యేక బాలకార్మిక ఖాతాకు మళ్లించి సంబంధిత బాలలకు 18 సంవత్సరాలు నిండిన అనంతరం వడ్డీతో సహా పొందే అవకాశం రూపొంచింది. ఈక్రమంలో కొంత మేరకు కార్మికుల సంఖ్య తగ్గుముఖం పట్టిందనే చెప్పాలి. అయితే అందుకు సంబధించిన అధికారుల సేవలు పారదర్శకంగా నిర్వహిస్తే ప్రతి ఒక్కరికి బంగారు బాటలే.

బాలలను బడి పిల్లలుగానే మార్చాలి

నేటి బాల కార్మికులను బడిలో చేర్చి చక్కని చదువును అందిస్తే దేశానికి వెన్నెముకలా నిలుస్తారు. ఈక్రమంలోనే తల్లిదండ్రులుతో పాటు దుకాణ దారులు కూడా చిన్నారుల భవితవ్యంపై బాద్యతగా మెలగాలి. ఉన్నతధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే బాలకార్మికుల నియంత్రణకు జూన్ 1 నుండి 30వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కొందరిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించాము.

- వి సాయిజ్యోతి, అసిస్టెంట్ లేబర్ అధికారి చీరాల

సాగర్ కాలువలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం

రూ.1.56 కోట్లు నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే ఏలూరి



పనులు ప్రారంభిస్తున్న చక్రపాణి, డీఈ స్వామి

మార్టూరు, జూన్13 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కోనంకి సబ్‌డివిజన్ పరిధిలో పర్చూరు నియోజకవర్గపరిధిలో 48 పనులు నిమిత్తం రూ.1.56 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో సాగర్ కాలువలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడతారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలో సాగర్ కాలువలలో జంగిల్ క్లియరెన్స్‌తోపాటు మెయిన్‌టెయిన్స్ పనులు నిమిత్తం నిధులు మంజూరుకు ఎమ్మెల్యే ఏలూరి జలవనరుల శాఖకు ప్రత్యేకంగా ప్రతిపాదనలను పంపించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధులను మంజూరు చేసింది. గత ప్రభుత్వంలో సాగర్ కాలువలలో చిన్న చిన్న పనులు నిమిత్తం ఒక్క పైసా కూడా నిధులను మంజూరు చేయలేదు. దీంతో సాగర్ కాలువలలో పిచ్చిచెట్లు, తుమ్మచెట్లు విపరీతంగా పెరిగాయి. తద్వారా సాగర్ జలాలు వచ్చినపుడు దిగువకు నీరు సక్రమంగా ప్రవహించక పోవడంతో దిగువ పొలాలును కలిగిన రైతులు నీరు అందక చాలా ఇబ్బందులకు గురయ్యేవారు. చాలా చోట్ల కాలువలు చిట్టడవిగా మారాయి. దీంతో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్చూరు నియోజకవర్గంలో రైతులకు ప్రాణప్రదమైన సాగర్ కాలువలో జంగిల్ క్లియరెన్స్ పనులు, కొన్నిచోట్ల పూడికతీత పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి భావించారు. అందుకోసం నిధులు మంజూరుకు ఏలూరి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఎట్టకేలకు నిధులను మంజూరుచేయడంతో నియోజకవర్గ పరిధిలో మొదటగా శుక్రవారం యద్దనపూడి బ్రాంచ్ కెనాల్‌లో రామకూరు 37వ మైలు వద్ద నుంచి దిగువకు 1.8 కిమీ వరకు సాగర్ కాలువలో రెండు వైపులా 1.84 కోట్ల నిధులతో జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించారు. ఈ పనులను సాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కమిటి వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి ప్రారంబించారు. ఇంకా మిగిలిన నిధులతో నియోజకవర్గ పరిదిలో సాగర్ కాలువలలోని పనులను త్వరలోనే ప్రారంభిస్తారని ఎన్ఎస్‌పీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటి నాగేశ్వరరావు, కొర్రపాటి కాజారావు, నీటి సంఘం అధ్యక్షులు తేలప్రోలు సుబ్బారావు, తాటి నాగార్జున, ముద్దన హనుమంతరావు, కరణం మారుతి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్‌కేఎం ట్రస్ట్‌కు సాయం



దాతలను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లకు ఆహారం అందజేస్తున్న ట్రస్ట్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆర్థిక సాయాన్ని అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాంటీన్లకు ఆహార పదార్థాలు సరఫరా చేస్తున్న మంగళగిరిలోని హరే కృష్ణ మూమెంట్(హెచ్‌కెఎం) చారిటబుల్ ట్రస్ట్‌కు వంటశాలకు అత్యాధునిక వంట మిషన్ల ఏర్పాటుకు రోటరీ 3150 డిస్టిక్ తరపున రూ.2 కోట్ల నిధి సేకరించాలని జిల్లాలోని అన్ని క్లబ్‌లకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో అద్దంకిలోని రోటరీ క్లబ్ తరపున రూ.55 వేలను జిల్లా క్లబ్‌కు అందజేశారు. దీనికి సంబంధించి రోటరీ మిత్రులను శుక్రవారం రోటరీ కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, నరసింహరావు, లేవి ప్రసాద్, రామకోటేశ్వరరావు, హరిప్రసాద్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చినగంజాం, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం వేదపండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా దంపతులతో కల్యాణ క్రతువు నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తులు కనులురా తిలకించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళా భక్తులు భజనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కడవకుదురు గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. సూమారు మూడు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటి సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పొగాకు రైతులను ఆదుకునేందుకే కొనుగోలు

మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పర్చూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నల్ల బర్లీ రైతులను ఆదుకునేందుకే ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు శ్రీకారం చుట్టిందని మార్క్‌ఫెడ్ బాపట్ల జిల్లా డీఎం కరుణశ్రీ అన్నారు. కొనుగోలుకు సంబంధించిన విధి విధానాలు, పాటించాల్సిన నియమాలు తదితర అంశాలపై శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో వ్యవసాయాధికారులు, పీఏసీఎస్ సిబ్బంది, రైతుసేవా కేంద్రాల సిబ్బంది, రైతులు, ఐటీసీ ప్రతినిధి కల్యాణ రామిరెడ్డి సారథ్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు గ్రేడులు తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనల ప్రకారం రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఐటీసీ ప్రతినిధి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా బర్లీ పొగాకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడం హర్షించతగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎస్.మోహనరావు, ఏవో రామమోహన్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి బర్లీ పొగాకు కొనుగోలులో సమస్యలు

వివరించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



రైతులతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడుకు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నల్ల బర్లీ పొగాకు కొనుగోలుకు సంబంధించిన పలు విషయాలపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్థానిక రైతులతో కలసి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడితో శుక్రవారం భేటీ అయ్యారు. పొగాకు రైతులకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకుపోయారు. రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని ఈ సందర్భంగా ఏలూరి కోరారు. కార్యక్రమంలో పర్చూరు నియోజక వర్గంలోని ఆయా మండలాల నాయకులు నాయుడు హనుమంతురావు, పొద వీరయ్య చౌదరి, కొల్లా శ్రీనివాసరావు(ఫ్యాక్టరీ), పోట్రు శోభన్, అడ్డగడ వెంకటేశ్వర్లు, కారుమంచి కృష్ణ, పోపూరి శ్రీనివాసరావు, హుస్సేన్, దాసి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ స్తూప నిర్మాణానికి సిమెంట్ వితరణ

అద్దంకిటౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): శ్రీరామ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శింగరకొండలో నిర్మిస్తున్న శ్రీరామ నామస్తూప నిర్మాణానికి రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సిమెంట్ అందజేశారు. పువ్వాడ రామకోటేశ్వరరావు సౌజన్యంతో స్తూపానికి రూ.50 బస్తాల సిమెంట్‌కు అవసరమైన చెక్కును అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమలో రోటరీ క్లబ్ సభ్యులు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, అంజద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

చీరాల అగ్నిమాపక కేంద్రానికి మహర్దశ

● రూ. 2 కోట్లు నిధులతో నూతన భవనం ఏర్పాటుకు శ్రీకారం
● ప్రస్తుత సాల్మన్ సెంటర్‌లోని బేర్ కాంపౌండ్ నుండి సేవలు
● వివరాలు వెల్లడించిన జిల్లా సహాయక అధికారి రామకృష్ణ



చీరాల అగ్నిమాపక కేంద్రం

చీరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : చీరాల అగ్నిమాపక కేంద్రానికి మహర్దశ వచ్చింది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరి, తక్కువ స్థలంలో సేవలు అందిస్తున్న కేంద్రం ప్రదేశంలోనే నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. అందుకు సంబంధించి జిల్లా అగ్నిమాపక సహాయక అధికారి వీవీ.రామకృష్ణ వివరాలు వెల్లడించారు. నూతన భవనం ఏర్పాటుకు రూ.2కోట్లు నిధులు మంజూరైనట్లు చెప్పారు. అందుకు సంబంధించి త్వరలోనే భూమి పూజ చేయనున్నట్లు వివరించారు. భవన ఏర్పడే వరకు సాల్మన్ సెంటర్‌లోని బేర్ కాంపౌండ్ తాత్కాలిక భవనం నుండి సేవలు అందించనున్నట్లు రామకృష్ణ తెలిపారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, టీడీపీ నేతలు

అద్దంకి, జూన్13(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తల్లుల ఖాతాలో కూటమి ప్రభుత్వం డబ్బులు జమచేయడంతో ఆనందంతో శుక్రవారం సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి రవికుమార్ చిత్రపటాలకు మండలంలోని మణికేశ్వరంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా కూటమి నేతలు పాలాభిషేకం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫోటోలు ఉన్న ఫ్లెక్సీలకు పాలాభిషేకము చేశారు. అద్దంకి పట్టణంలోని 1వ వార్డులో కూడా విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమాలలో అద్దంకి నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, మోషే, మాథ్యూస్, రవి, బడావలి, ఆదినారాయణ, ప్రసాద్, తిమోతి, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలుపుకున్న కూటమి ప్రభుత్వం

● ఒకే ఇంట్లో ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం నగదు జమ



నగదు అందుకున్న కుటుంబం

పర్చూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనంతో నిరుపేద కుటుంబాల్లో ఆనందం వెల్లువిరిసింది. ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన తల్లికి వందనం ద్వారా తల్లిదండ్రుల ఖాతాల్లోకి నగరు జమకావటంతో వారి ఆనందానికి అద్దేలేకుండా పోయింది. పర్చూరుకు చెందిన పఠాన్ అబ్దుల్ సీలీం, సబీహ కుంటుంబలో ఉన్న ఇద్దరు పిల్లలు సాహిల్, తస్నియాలకు తల్లికి వందనం వారి ఖాతాల్లో జమఅయ్యింది.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం : పఠాన్ సబీహ

ఇచ్చిన మాటను నిలుపుకొని కూటమి ప్రభుత్వం తల్లివందనం ద్వారా నగదును జమచేసిన కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. ప్రభుత్వం విద్యకోసం మాలాంటి నిరుపేదలకు సాయం అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉంది. మా ఇంట్లో ఉన్న ఇద్దరు పిల్లలకు ఒక్కొరికి రూ.13000వేల చొప్పున మొత్తం రూ.26000వేల నగదు జమకావటం గర్వంగా ఉంది. ప్రభుత్వ సహాయాన్ని ఎన్నటికీ మరువలేం.

ప్రభుత్వ పాఠశాలలో అరకొర వసతులు



వసతుల లేమితో ఉన్న పాఠశాల



ఉప్పుటూరులో నిర్మాణంలో ఉన్న తరగతి గదులు

పర్చూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంవత్సరం ప్రారంభానికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. భవనాల అసంపూర్తి నిర్మాణాలు, గదులు, మౌలిక వసతుల కొరత విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తోంది. రెక్కల కష్టంతో జీవించే నిరుపేదలు సైతం తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలలకు పంపేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు విధాలుగా కృషి చేస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పలుచోట్ల పాఠశాల భవ నాల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన నిలిచాయి.

చినుకుపడితే తరగతి గదిలోనికి నీరు

పర్చూరు మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎంపీపీయస్), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఒకే ప్రాంగణంలో ఉన్నా యి. ఈ రెండూ పాఠశాలలకు సంబంధించి దాదాపు 200లకు పైగా విద్యార్థులు ఉన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కింద గ్రామంలోని మరో ప్రాంగణంలో ఎంపీపీ ఎస్ పాఠశాలను నిర్మాణం చేసుకునే విధంగా చర్యలు చేపట్టినా రూపులెవల్‌కే పరిమితం అయ్యింది. ప్రస్తుతం పాఠశాల ప్రాంగణం ముళ్ళ చెట్లతో అసంపూర్తిగా దర్శనమిస్తుంది.

జిల్లా పరిషత్ పాఠశాల పరిస్థితి ఇదే

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించి అదనపు తరగతులకు చర్యలు చేపట్టిన నాటి వైసీపీ ప్రభుత్వం చర్యలతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో అరాకొరా వసతుల నడుమ విద్యార్థులు బోధన కొన సాగాల్సిన దుస్థితి ఏర్పడింది. మండలంలో అనే క పాఠశాలలో ఇదే పరిస్థితి ఉంది.